www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 44 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శనివారం 30 - 05 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ.. జైలుకు తరలింపు

## ఏపీలో రూ.22 వేల కోట్లతో
# భారీ విద్యుత్ కారిడార్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ప్రతిపాదనలు
- 18 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా ప్రణాళిక
- ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశం
- పీఎం సూర్యఘర్ పథకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం సూచన
- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో కలిసి పనిచేయాలని నిర్ణయం



**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, దానిని సమర్థంగా గ్రిడ్‌కు అనుసంధానించేందుకు భారీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా, సుమారు రూ.22 వేల కోట్ల వ్యయంతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్, విద్యుత్ సరఫరా, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు పురోగతిపై విస్తృతంగా చర్చించారు.గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద చేపట్టనున్న చర్యలపై సీఎం ఆరా తీయగా, అధికారులు పూర్తి వివరాలు అందించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 18 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు - మిగతా 2 లో



2 లో

## రాహుల్ గాంధీతో
# షర్మిల భేటీ

- కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు
- భేటీలో షర్మిల భర్త అనిల్ కుమార్, కేసీ వేణుగోపాల్
- కర్ణాటక నుంచి రాజ్యసభ సీటు కోరుతున్నట్లు కథనాలు
- వైఎస్ఆర్టీపీని విలీనం చేసిన సమయంలో రాజ్యసభ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం



## మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- విజయవంతంగా ముగిసిన టీడీపీ మహానాడు
- తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరిగిన తొలి మహానాడు అన్న లోకేశ్
- టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందన్న లోకేశ్

**అమరావతి :**
తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు నిన్న విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పందిస్తూ... మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి - మిగతా 2 లో




2 లో

## విశాఖ కేంద్రంగా
# కొత్త రైల్వే జోన్

- జూన్ 1 నుంచి కార్యకలాపాలు
- కొత్త జోన్ పరిధిలోకి విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు
- నెరవేరిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీ
- మూడు డివిజన్లకు పరిమితం కానున్న దక్షిణ మధ్య రైల్వే

## కాక్రోచ్ జనతా పార్టీ ఖాతా నిలిపివేత

- కేంద్రానికి, ఎక్స్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు
- కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతా నిలిపివేత
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించిన హైకోర్టు




2 లో..

## దేశానికి రుతుపవనాల షాక్



- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం!
- 2026 నైరుతి రుతుపవనాలపై ఐఎండీ కీలక అంచనా
- దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకు అవకాశం
- ఎల్ నినో ప్రభావమే బలహీన రుతుపవనాలకు కారణమని వెల్లడి
- జూన్‌లో ఏపీ సహా పలు రాష్ట్రాల్లో పెరగనున్న వడగాడ్పుల తీవ్రత
- దీర్ఘకాల సగటులో 90 శాతం వర్షపాతమే నమోదయ్యే సూచనలు

**ఢిల్లీ :**
ఈ ఏడాది దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2026 - మిగతా 2 లో



## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం
## హైదరాబాద్‌లోనూ చూడొచ్చు!

- కనువిందు చేయనున్న బ్లూ మైక్రోమూన్
- ఒకే నెలలో రెండో పౌర్ణమిగా రాక
- హైదరాబాద్‌లో సాయంత్రం వీక్షించేందుకు ఉత్తమ సమయం
- సాధారణ పౌర్ణమి కంటే కాస్త చిన్నగా కనిపించనున్న చంద్రుడు


**హైదరాబాద్ :**
హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశవ్యాప్తంగా ఖగోళ ప్రియులు మే 31న ఒక అరుదైన దృశ్యాన్ని వీక్షించబోతున్నారు. ఆ రోజు ఆకాశంలో 'బ్లూ మైక్రోమూన్' - మిగతా 2 లో

# త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు?

- ఆర్‌బీఐ చర్చలు..!
- భారీగా పెరిగిన పేపర్ కరెన్సీ ముద్రణ ఖర్చు
- సవాల్‌గా మారిన చిరిగిన నోట్ల నిర్మూలన
- పరిష్కారంగా ప్లాస్టిక్ నోట్లపై ఆర్బీఐ చర్చలు
- తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక
- త్వరలోనే పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభానికి యోచన



**ఢిల్లీ :**
దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నగదుకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) ఈ - మిగతా 2 లో




## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న
# రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- ఉద్యోగుల బకాయిలను 100 రోజుల్లో విడుదల చేస్తామని హామీ
- ఈ క్రమంలో తొలి విడతగా రూ.2 వేల కోట్ల బకాయిల విడుదల
- ఉద్యోగ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం

**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని ఇవాళ విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన - మిగతా 2 లో



## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు

- 'ఈగిల్ టీమ్' పేరిట విధులు
- తెలంగాణలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు
- హైడ్రా సంస్థలో... కబ్జాల తొలగింపు విధుల్లో నియామకం
- ఈ ఉద్యోగం తమకు గౌరవం, ఆత్మవిశ్వాసం ఇచ్చిందని వెల్లడి
- వారి పనితీరుపై అధికారుల ప్రశంసలు

**హైదరాబాద్ :**
తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన - మిగతా 2 లో

# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై మంత్రి మీడియా సమావేశం
- ప్రతిపక్షాలు కావాలనే విమర్శలు చేస్తున్నాయని మండిపాటు
- 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వెల్లడి
- ఇప్పటికే రూ.13,050 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్న మంత్రి



**హైదరాబాద్ :**
ధాన్యం కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు.రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'గిగ్' కార్మికుల రక్షణే నేటి సామాజిక న్యాయం

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) చట్టం కొన్ని కీలక సంస్కరణలకు నాంది పలికింది. ఈ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే ఎటువంటి షరతులు లేకుండా తక్షణమే ప్రమాద బీమా అందుతుంది. సెక్షన్ 12 ప్రకారం 'ఆటోమేటెడ్ మానిటరింగ్' అల్గారిథమ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకునే హక్కు కార్మికులకు లభిస్తుంది. అలాగే యాజమాన్యాలు ఏకపక్షంగా కార్మికులను తొలగించకుండా కనీసం ఏడు రోజుల ముందు రాతపూర్వక నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.భారత గిగ్ ఎకానమీ వేగంగా వృద్ధి చెందుతోంది. ఎకనామిక్ సర్వే 2025--26 ప్రకారం, గిగ్ కార్మికుల సంఖ్య 2024--25 నాటికి సుమారు 12 మిలియన్లకు పెరిగింది. ఈ సంఖ్య 2029--30 నాటికి 23.5 మిలియన్లకు, 2047 నాటికి 62 మిలియన్లకు చేరుకోవచ్చు. ఈ శ్రామికశక్తిలో మహిళలు సుమారు 28శాతం మంది ఉండగా, దాదాపు 40శాతం మంది నెలకు రూ.15వేల కంటే తక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. 2029--30 నాటికి ఈ రంగం సేవల విలువ రూ.2.35 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా.కానీ ఈ అంకెల వెనుక, తగిన భద్రతా చర్యలు, సమగ్ర బీమా లేకుండా ప్రమాదకర పరిస్థితులలో పనిచేస్తున్న కార్మికవర్గం ఉంది. ఏప్రిల్ 7 అర్ధరాత్రి హైదరాబాద్‌లో శివ, సందీప్ అనే ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు డెలివరీ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్నారు. కుటుంబాలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో వారు రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఒక కారు డ్రైవర్ వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టగా ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఫిబ్రవరిలో, ఢిల్లీలో వేకువజామున 3:30 గంటలకు 25 ఏళ్ల హేమ్ శంకర్ ఈ--స్కూటర్‌ను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో మరణించాడు. ఆ ఆర్డర్లు ఇచ్చిన వినియోగదారులకు 'ఆర్డర్ క్యాన్సిల్ అయింది' అని ఒక మెసేజ్ మాత్రమే వచ్చి ఉంటుంది. తమ ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే డెలివరీ బాయ్ ప్రాణాలు కోల్పోయాడన్న చేదు నిజం వారికి తెలియకపోవచ్చు.2025 నవంబర్‌లో అమల్లోకి వచ్చిన 'సోషల్ సెక్యూరిటీ కోడ్--2020' గిగ్ కార్మికులను ఒక ప్రత్యేక తరగతిగా గుర్తించింది. దీని ప్రకారం సంస్థలు తమ వార్షిక టర్నోవర్‌లో 1--2 శాతం సామాజిక భద్రతా నిధికి జమ చేయాలి. అయితే, ముసాయిదా సోషల్ సెక్యూరిటీ కోడ్ నిబంధనల ప్రకారం ఈ ప్రయోజనాలు పొందాలంటే కనీసం 90 రోజులు పనిచేయాలన్న నిబంధన ఉంది. జనవరిలో నోయిడాలో 18 ఏళ్ల డెలివరీ బాయ్ అంకుష్ విధుల్లో చేరిన తొలిరోజే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. డెలివరీ ఏజెంట్‌గా చేరిన మొదటి రోజు నుంచే ఎలాంటి షరతులు లేకుండా నగదు రహిత అత్యవసర వైద్యం అందించేలా నిబంధనలు తక్షణమే మార్చాలి. ముఖ్యంగా, తెలంగాణ చట్టం సెక్షన్ 8(బి) ప్రకారం 'సంక్షేమ బోర్డు'కు ఈ నిబంధనలు నోటిఫై చేసే అధికారం ఉంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న సమయంలోనూ గిగ్ కార్మికులు గంటలపాటు రోడ్లపైనే గడుపుతున్నారు. తమిళనాడు ప్రభుత్వం చెన్నై నగరంలో గిగ్ కార్మికుల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన ఏసీ లాంజ్‌ల తరహాలో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో నీడ, తాగునీరు, ఛార్జింగ్, మరుగుదొడ్ల సదుపాయాలతో కూడిన విశ్రాంతి కేంద్రాలను నిర్మించడం యాజమాన్యాలు, ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. వీధి కుక్కలు, సరైన వెలుతురు లేని భవనాలు లాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పుడు కస్టమర్లు ముందుగానే యాప్ ద్వారా సమాచారం ఇచ్చే అవకాశం ఉండాలి. అలాగే కార్మికులకు ఆర్డర్‌ను తిరస్కరించే హక్కు ఉండాలి. ఈ సమస్యల పరిష్కారానికి యాప్‌లలో తక్షణమే కొన్ని మార్పులు తీసుకురావాలి.ముఖ్యంగా రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల మధ్య ఆర్డర్ చేసేటప్పుడు రాత్రి పూట అత్యవసర సమ్మతిని తప్పనిసరి చేయాలి. 'ఈ డెలివరీ కోసం ఒక వ్యక్తి రాత్రి పూట రోడ్డుపై ప్రయాణించాలి, ఇది రేపు ఉదయం డెలివరీ చేయవచ్చా' అనే ఆప్షన్ వినియోగదారులకు స్పష్టంగా కనిపించాలి. అలాగే ఉదయానికి ఆర్డర్ షెడ్యూల్ చేసుకునే వినియోగదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. రాత్రి పూట చేసే ఆర్డర్లకు ప్రత్యేక సర్‌ఛార్జ్ వసూలు చేసి, ఆ నిధిని కార్మికుల బీమాకు, రిఫ్లెక్టివ్ సేఫ్టీ జాకెట్లు అందించేందుకు వాడాలి.మన గుమ్మం వద్దకు డెలివరీ బ్యాగ్ వేసుకుని వచ్చేది ఎవరో కాదు, నిరుద్యోగం వల్ల కుటుంబ భారాన్ని మోస్తూ ఆత్మగౌరవంతో సొంత కాళ్లపై నిలబడాలని తపించే మన విద్యావంతులైన యువతే అనే దృక్పథం సమాజంలో రావాలి. మనమే నాలుగు అడుగులు ముందుకేసి డెలివరీని స్వీకరించడం, డెలివరీ చేతికి అందగానే చిరునవ్వుతో 'థాంక్స్' చెప్పడం, ఒక గ్లాసు చల్లటి నీళ్లు అందించడం... వారి అలసటను దూరం చేస్తాయి. శివ, సందీప్, హేమ్ శంకర్ కేవలం గణాంకాలు కారు. మెరుగైన భవిష్యత్తు కోసం కలలు కన్న యువకులు. వారిని విస్మరించడం ఏ మాత్రం తగదు. ఎందుకంటే మరో ఆర్డర్ మన ఇంటికి వస్తూనే ఉంటుంది, మనం మేల్కోకపోతే మరో విషాదం కూడా అలాగే పునరావృతమవుతుంది.

## మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా

మొదటిపేజీ తరువాయి - ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. కోట్లాది మంది టీడీపీ కుటుంబ సభ్యుల ఆశీస్సులతో తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానని... తాను ఈ పదవిని చేపట్టిన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని అన్నారు. టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందని చెప్పారు.మహానాడు 2026 విజయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది,అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ అంకితం చేస్తున్నానని తెలిపారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడును ప్రధాని మోదీ పిలుపుతో, అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని లోకేశ్ తెలిపారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడాన్ని చంద్రబాబు మనకు నేర్పారని... ఆ నేర్పును హైబ్రిడ్ మహానాడుకు ఉపయోగించి విజయవంతం చేశామని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇల్లు, ప్రతి పల్లె మహానాడుకు వేదిక అయిందని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని... ఇది మహానాడు సాధించిన మరో ఘన విజయమని

## త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు?

మొదటిపేజీ తరువాయి - దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవల పట్నా, ముంబై నగరాల్లో జరిగిన బోర్డు సమావేశాల్లో ప్లాస్టిక్ నోట్లపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం వాడుతున్న కాగితపు నోట్లతో పోలిస్తే వాటి ముద్రణ ఖర్చు తక్కువగా ఉండటం, ఎక్కువ కాలం మన్నడమే ఇందుకు కారణం.గత ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ నోట్ల ముద్రణ కోసం ఆర్‌బీఐ ఏకంగా రూ.6,372.8 కోట్లు ఖర్చు చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది చాలా పెరిగింది. కొత్తగా తీసుకురాబోయే ప్లాస్టిక్ నోట్లను సులభంగా విత్‌డ్రా చేసుకునేలా ఏటీఎం యంత్రాల్లోనూ అవసరమైన సాంకేతిక మార్పులు చేయనున్నారు. ఇందుకోసం త్వరలోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ నోట్లను విడుదల చేసేందుకు ఆర్‌బీఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నా మార్కెట్లో నగదు చలామణి రికార్డు స్థాయిలో రూ.42.86 లక్షల కోట్లకు చేరింది.మార్కెట్లో పాడైపోయిన, చిరిగిపోయిన నోట్లను సేకరించి వాటిని నిర్మూలించడం ఆర్‌బీఐకి సవాలుగా మారింది. గత ఏడాదిలోనే సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను వెనక్కి తీసుకుంది. ఇందులో ఎక్కువగా రూ.500, రూ.100 నోట్లే ఉన్నాయి. ప్లాస్టిక్ నోట్లు వస్తే ఈ సమస్య చాలా వరకు తగ్గుతుంది. గతంలో 2012లో యూపీఏ ప్రభుత్వం ఐదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మకంగా తీసుకురావాలని చూసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ అప్పట్లో ఆగిపోయింది. కానీ ఇప్పుడు పూర్తి స్థాయి సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది.

## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం



మొదటిపేజీ తరువాయి - కనువిందు చేయనుంది. ఒకే నెలలో రెండోసారి పౌర్ణమి రావడం, అదే సమయంలో ఈ ఏడాదిలోనే చంద్రుడు అత్యంత చిన్నగా కనిపించనుండటం దీని ప్రత్యేకత.2026 మే నెలలో రెండు పౌర్ణములు సంభవిస్తున్నాయి. మొదటి పౌర్ణమి మే 1న రాగా, రెండోది మే 31న రానుంది. సాధారణంగా ఒకే క్యాలెండర్ నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమిని 'బ్లూ మూన్' అని పిలుస్తారు. అలాగే, మే 31న చంద్రుడు భూమికి అత్యంత దూరంలో (అపోజీ) ఉండనున్నందున దీనిని 'మైక్రోమూన్' అని కూడా అంటున్నారు. ఇలా బ్లూ మూన్, మైక్రోమూన్ రెండూ ఒకేసారి రావడం చాలా అరుదు.ఈ బ్లూ మైక్రోమూన్ సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే 6-7 శాతం చిన్నగా, కొంచెం తక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తుంది. అయితే, పేరులో 'బ్లూ' ఉన్నప్పటికీ చంద్రుడు నీలం రంగులో కనిపించడు. ఇది కేవలం ఒక ఖగోళ నామకరణం మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.హైదరాబాద్‌లో మే 31న సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య తూర్పు వైపు ఆకాశంలో దీన్ని స్పష్టంగా చూడవచ్చు. వాతావరణం అనుకూలిస్తే ఎలాంటి ప్రత్యేక పరికరాలు లేకుండానే కళ్లతో ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చు. ఈ సమయంలో చంద్రుడు స్కార్పియస్ రాశిలోని ప్రకాశవంతమైన అంటారిస్ నక్షత్రానికి సమీపంలో కనిపిస్తాడు.

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్

మొదటిపేజీ తరువాయి - చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో 11 గిగావాట్ల సౌర విద్యుత్, 7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉంటుందని వివరించారు.ఈ కారిడార్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,261 కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు వేయనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, 9,500 మెగావాట్ల సామర్థ్యంతో ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కారిడార్ పూర్తయితే రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, తద్వారా భారీ పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును కాలపరిమితితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో ఏపీ ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు రూ.20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు



బిగించే లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేయాలన్నారు. రెస్కో మోడల్‌లో, నెట్ మీటరింగ్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే, 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో 'నెట్ జీరో' విధానంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.దేశంలోనే తొలిసారిగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ద్వారా 'డిజిటల్ ట్విన్ గ్రిడ్' రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు.సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్' కార్యాచరణపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేయనుంది.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులను కార్యాచరణతో అనుసంధానం చేయాలని, ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



మొదటిపేజీ తరువాయి - కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది.వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్




మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న దేశంలోని 18వ రైల్వే జోన్ 'దక్షిణ కోస్తా రైల్వే' జూన్ 1 నుంచి అధికారికంగా కార్య కలాపాలు ప్రారంభించనుంది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతో పాటు, తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్‌ను పునర్వ్యవస్థీకరించి 'విశాఖపట్నం డివిజన్'గా మార్చి కొత్త జోన్‌లో విలీనం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని హామీ మేరకు ఈ ప్రాంతంలో రైల్వే పాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ జోన్ ఏర్పాటు ప్రక్రియ ఇప్పుడు కార్యరూపం దాల్చింది.ఈ పునర్వ్యవస్థీకరణతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధి గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఆరు డివిజన్లు ఉండగా, ఇకపై హైదరాబాద్, నాందేడ్, పునర్వ్యవస్థీకరించిన సికింద్రాబాద్ డివిజన్లతో మాత్రమే కొనసాగుతుంది. కార్యకలాపాల సౌలభ్యం కోసం పలాస-ఇచ్ఛాపురం, రాయచూరు-వాడి వంటి కొన్ని సెక్షన్లను కూడా సర్దుబాటు చేశారు.కొత్త జోన్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు, పాలనా సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జూన్ 1న కార్యకలాపాలు ప్రారంభించేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. విశాఖలో తాత్కాలిక భవనంలో జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండగా, శాశ్వత భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# దేశానికి రుతుపవనాల షాక్



మొదటిపేజీ తరువాయి - రుతుపవనాలకు సంబంధించి విడుదల చేసిన దీర్ఘకాలిక అంచనాల ప్రకారం, జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో కేవలం 90 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది. ఈ అంచనాల్లో 4 శాతం అటూఇటూగా మార్పులు ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈసారి వర్షపాతం 'సాధారణం కంటే తక్కువ' కేటగిరీలోకి వస్తుందని, ఇది వ్యవసాయ రంగం, జలవనరులు, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.ఈ అంచనాలకు ప్రధాన కారణంగా పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో పరిస్థితులను ఐఎండీ పేర్కొంది. ఎల్ నినో సాధారణంగా రుతుపవన వ్యవస్థను బలహీనపరుస్తుంది. మరోవైపు, రుతుపవనాలకు మేలు చేసే ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) ప్రస్తుతం తటస్థంగా ఉందని, రుతుపవన కాలంలో కూడా అలాగే కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, ఈ సీజన్‌లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యేందుకు 84 శాతం అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇటీవలి సంవత్సరాలలో ఇది అత్యంత బలహీనమైన రుతుపవన సీజన్లలో ఒకటిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది.ప్రాంతాల వారీగా చూస్తే.. దేశంలోని అధిక వర్షాధార వ్యవసాయ ప్రాంతాలు ఉండే 'మాన్‌సూన్ కోర్ జోన్'లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేశారు. ఈశాన్య భారతంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, వాయువ్య, మధ్య, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో లోటు వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తెలిపింది. అయితే, వాయువ్య, ఈశాన్య, తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని తూర్పు భాగాలలో అక్కడక్కడా సాధారణం నుంచి అధిక వర్షపాతం కురవవచ్చని పేర్కొంది.ఇక, జూన్ నెలకు సంబంధించి దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ హెచ్చరించింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వడగాడ్పులు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నీటి యాజమాన్య పద్ధతులు, కరవును తట్టుకునే విత్తనాల ఎంపిక వంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సలహా ఇచ్చింది. జులై నెలకు సంబంధించిన పూర్తిస్థాయి అంచనాలను జూన్ చివరి వారంలో విడుదల చేయనున్నట్లు ఐఎండీ వెల్లడించింది.మన దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత, సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు.ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్ ను విచారించింది. ఈ సందర్భంగా అభిజిత్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... ఎక్స్ ఖాతా నిలిపివేయడం ద్వారా పార్టీ కార్యకలాపాలు, ప్రజలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని కోర్టుకు తెలిపారు. వెంటనే పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని కోరారు.ఈ వాదనలపై కోర్టు స్పందిస్తూ... తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి, ఎక్స్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా కేంద్ర ప్రభుత్వం, ఎక్స్ సంస్థ తమ సమాధానాలను సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది.

# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం

మొదటిపేజీ తరువాయి - 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.




## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు.ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి - జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది.ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు.ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు."గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్వి రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు.ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

## సినీ ప్రముఖులు కాశీ విశ్వనాథ్ వారి నివాసంలో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ




**సీతానగరం,మే29.అక్షర టైమ్స్:-** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ప్రముఖ సినీ రచయిత, నటులు, దర్శకులు మరియు ప్రసిద్ధ సాహిత్యవేత్త కాశీ విశ్వనాథ్ గృహంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా స్వామివారిని ప్రార్థించారు.ఈ శుభసందర్భంగా కాశీ విశ్వనాథ్ మరియు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ని శాలువాతో కప్పి,చిరు సత్కారంతో పాటు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.,సినీ రంగంలో నటుడిగా, దర్శకుడిగా, రచయితగా తనదైన ముద్ర వేసి, తెలుగు సాహితీ లోకంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన కాశీ విశ్వనాథ్ ఇంట్లో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. వారి కుటుంబ సభ్యులందరికీ ఆ సత్యనారాయణ స్వామి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానరు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

### పురుషోత్తపట్నంలో పిడుగుపాటుకు గురైన రైతు సేవా

## కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

- ప్రమాదంలో 6 వేల గోనె సంచులు పూర్తిగా దగ్ధం
- ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దు, అధికారుల తదుపరి చర్యలు వేగవంతం
- జిల్లాలో భారీ వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు





**సీతానగరం,మే29.అక్షర టైమ్స్:-** సీతానగరం మండల పరిధిలోని పురుషోత్తపట్నం గ్రామంలో గురువారం (ది.28.05.2026) రాత్రి 9:15 గంటల ప్రాంతంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సంభవించింది. ఈ క్రమంలో స్థానిక రైతు సేవా కేంద్రంపై పిడుగు పడటంతో అక్కడ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో రైతు సేవా కేంద్రంలో నిల్వ ఉంచిన సుమారు 6 వేల గోనె సంచులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు, దీంతో ఒక పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.విషయం తెలుసుకున్న వెంటనే రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ఉదయం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. దెబ్బతిన్న రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును, నష్టాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఘటన జరిగిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని, నష్టాన్ని అంచనా వేస్తున్నారని వివరించారు. ప్రమాద తీవ్రతపై ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ప్రజలు, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజలకు ఎమ్మెల్యే బత్తుల ముఖ్య విజ్ఞప్తి & హెచ్చరిక:**

"రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం జిల్లాలో రానున్న కొన్ని రోజుల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా 40 నుండి 50 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. వాతావరణం అనుకూలంగా లేనందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం పడే సమయంలో, ఉరుములు, మెరుపులు వచ్చేటప్పుడు ఎవరూ బహిరంగ ప్రదేశాల్లో తిరగవద్దు. ముఖ్యంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు (పోల్స్), మరియు హోర్డింగ్స్ క్రింద నిలబడరాదు." ఈ కార్యక్రమంలో సీతానగరం ఎమ్మార్వో శ్రీనివాస్, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏడి శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పాటు జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతానగరంలో వైభవంగా వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర

- ఎద్దుల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ





**సీతానగరం,మే29.అక్షర టైమ్స్:-** తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు, గ్రామీణ క్రీడలకు ప్రతీకగా నిలిచే ఎద్దుల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీతానగరం మండలం కేంద్రమైన సీతానగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మాతృశ్రీ వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నిర్వాహకులు సాంప్రదాయ ఎద్దుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ హాజరయ్యారు. ఉత్సాహభరిత వాతావరణంలో వారు జెండా ఊపి ఈ ఎద్దుల పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ "మన తెలుగు సంస్కృతిలో జాతరలు, గ్రామీణ క్రీడలకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. అందులోనూ రైతన్నకు, పశు సంపదకు ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పేలా ఇలాంటి ఎద్దుల పోటీలను నిర్వహించడం అభినందనీయం. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. ఈ జాతరను ఇంత వైభవంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు నా అభినందనలు." ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు, యువకులు తరలివచ్చారు. పోటాపోటీగా సాగిన ఎద్దుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి , జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గంగవరం క్రికెట్ టోర్నమెంట్ కు కంబాల 30 వేలు ప్రైజ్ మనీ అందజేత




**గోకవరం,మే29.అక్షర టైమ్స్:-** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, గంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీపీఎల్ సీసన్-7, శ్రీ కలుముల కామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్, విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తరుపున రామసేన సభ్యులు, బీజేపీ నాయుకులు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 6వ తేదీన ప్రారంభమై, శుక్రవారం ఫైనల్ కు చేరుకుంది. ఈ టోర్నమెంట్ కు కంబాల శ్రీనివాసరావు మొదటి ప్రైజ్ మనీ 30,000 రూపాయలు అందజేశారు. రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు విజేతలకు ప్రైజ్ మనీ, ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, యువసేన యూత్ సభ్యులు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించే ముందు, కంబాల శ్రీనివాసరావు వద్దకు వెళ్లి గంగవరం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, సహకారం అందించాలని కోరగా స్పందించిన ఆయన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించుకోండి అని భరోసా కల్పించి, మొదట ప్రైజ్ మనీ 30,000 రూపాయలు తానే ఇస్తానని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. అనంతరం రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ క్రీడాకారుల ప్రోత్సాహానికి కంబాల శ్రీనివాసరావు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఆలయాల అభివృద్ధికి, క్రీడాకారులకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఎంపీటీసీ మడకం బులియమ్మ, బీజేపీ మండల అధ్యక్షులు చిన్న లీలాలమ్మా, ఉపాధ్యక్షులు అర్జున్, రామసేన సభ్యులు బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, పోలవరం రామసేన ఇంచార్జ్ కడబాల సుధా, దోసపాటి సుబ్బారావు, మండే గౌతమ్, కాకర దుర్గారావు, గ్రామ పెద్దలు క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్పీ నందు శిక్షణలో ఉన్న పోలీస్ కానిస్టేబుళ్లకు సైబర్ క్రైమ్ మరియు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన





**కాకినాడ,మే29.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈరోజు కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ నందు శిక్షణ పొందుతున్న 300 మంది శిక్షణా పోలీస్ కానిస్టేబుళ్లకు హెల్మెట్ ఆవశ్యకత మరియు సైబర్ నేరాలు అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మరియు వీడియోల ద్వారా ఒక సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని కాకినాడ ట్రాఫిక్ 1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్ నిర్వహించారు. ఈ సదస్సులో మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారంతా సీట్ బెల్ట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరించారు. అలాగే జీబ్రా లైన్స్ లేని ప్రదేశాలలో రోడ్డు దాటే విధానం, ట్రాఫిక్ సైన్స్ ప్రాముఖ్యత, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణించరాదనే నియమాలతో పాటు, రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుండి 7 రోజుల వరకు వర్తించే రూ. 1,50,000 ఉచిత నగదు రహిత చికిత్స సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. మహిళల భద్రత, ఈవ్ టీజింగ్ నివారణా చర్యలపై ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ దండాయన గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలైన ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్, ఆన్‌లైన్ జాబ్స్ మరియు వర్క్ మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బాధితులు మరియు ప్రజలు తక్షణ సాయం కోసం, సమాచారం అందించడం కోసం సంప్రదించాల్సిన అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల ఉద్దేశాలను వివరించారు. శాంతిభద్రతల సమస్యలు మరియు తక్షణ పోలీస్ సాయం కోసం 112 నంబర్‌ను, సైబర్ ఆర్థిక మోసాలకు గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేసి డబ్బును కాపాడుకోవడానికి 1930 నంబర్‌ను, మరియు సమాజానికి పీడకలగా మారిన గంజాయి రవాణా, విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించడం కోసం 1972 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలని ట్రైనీ కానిస్టేబుళ్లకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## క్లస్టర్ ఇంచార్జ్ లను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం,మే29.అక్షర టైమ్స్:-** కేంద్ర టిడిపి పార్టీ ఆదేశానుసారం జగ్గంపేట నియోజవర్గంలో మహానాడు విజయవంతం చేసిన క్లస్టర్ ఇంచార్జ్ లను ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చేతుల నెహ్రూ ఘనంగా సన్మానించారు. వీరితో పాటుగా మండల పార్టీ అధ్యక్షులను సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా గోకవరం మండలం గోకవరం మండలం క్లస్టర్ ఇంచార్జ్ లు కన్నబాబును, అడపా భరత్ కుమార్ ను, జాస్తి వసంతను, పాలకుర్తి ఆదినారాయణ ను, బసవ సూర్య ప్రకాష్ రావు (చినబాబు), దేవరపల్లి మూర్తిని, పాఠం శెట్టి మురళి కృష్ణను, కుర్ల చినబాబును ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ మరియు నియోజవర్గ టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. వారితోపాటు మండల అధ్యక్షులు జీను మణిబాబును, పిల్ల చంటిబాబును, వీరం రెడ్డి కాశి బాబును, పోతుల మోహన్రావును ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కష్టపడిన వారికి పార్టీలో ఎప్పుడో గుర్తింపు ఉంటుందని, కష్టపడిన వారిని సన్మానించడం అంటే మనలను మనమే సన్మానించుకోవడమని ఇది ఎంతో మంచి సాంప్రదాయమని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండల స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్




**కాకినాడ,మే29.అక్షర టైమ్స్:-** జూన్ 1న సీఎం చంద్రబాబు తుని పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధరప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సీఎం పర్యటనపై ఆయన సమీక్షించారు.సీఎం రాక నుంచి తిరుగుప్రయాణం వరకు జరిగే కార్యక్రమాలను వివరించి, ఏర్పాట్లపై ఆరా తీశారు.ఈ సమావేశంలో మండల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా పాల్గొన్నారు.

## మహిళలకు 33% రిజర్వేషన్ పట్ల హర్షం



**కాకినాడ,మే29.అక్షర టైమ్స్:-** మహిళలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించడం పట్ల తెలుగు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడజిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టీడీపీలో మహిళలకు 33% సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన జాతీయ అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా మహిళా నేతల ఆధ్వర్యంలో "థాంక్యూ లోకేష్ అన్నా" కార్యక్రమం నిర్వహిశీచారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అనాదిగా మహిళలకు ఎప్పుడూ సముచిత స్థానం కల్పించబడినదని, రాజకీయాల్లో కూడా 33శాతం అమలు చేయాలని మహానాడు తీర్మానించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్, కలగా శివరాణి,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ఎంతో అవసరం

### - ఐఓసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ వీహెచ్ ప్రదీప్ బుద్ధ






**గోకవరం,మే29.అక్షర టైమ్స్:-** ప్రతి ఒక్కరూ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొందడం ఎంతో ఉపయోగమని ఐఓసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ వీహెచ్ ప్రదీప్ బుద్ధ అన్నారు. శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) రాజమండ్రి టెర్మినల్ (మార్కెటింగ్ డివిజన్) క్యాం పస్ నందు బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సీపీఆర్ గురించి,ఎప్పుడు ఏ సందర్భంలో ప్రమాదం జరిగిన వెనువెంటనే చేయు ప్రథమ చికిత్స గురించి, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, పాముకాటు కు చేయు ప్రథమ చికిత్స ను తెలిపారు. సేఫ్టీ ఆఫీసర్ పీఏ అస్లాం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎమ్ భాస్కరరావు,రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,కోశాధికారి డాక్టర్ డాక్టర్ జి మహాలక్ష్మి,ఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు,ట్రైనర్ చిన్ని సత్యనారాయణ(చంటి),లైఫ్ మెంబర్ పి చిన్ని,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు సూపర్ సక్సెస్

### - టిడిపి కార్యకర్తలు, నాయకులు సత్తా చాటారన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు



**గోకవరం,మే29.అక్షర టైమ్స్:-** ఊరు ,వాడ ప్రతిచోట వర్చువల్ మహానాడు మహా జాతరను తలపించే విధంగా పండుగ వాతావరణం తలపించిందని గోకవరం క్లస్టర్-1 ఇంచార్జ్ ,రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజవర్గ టిడిపి పరిశీలకులు కన్నబాబు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాలలో మహానాడు చాలా గొప్పగా నిర్వహించబదిందనీ,18 లక్షల పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, 25 లక్షల మంది డిజిటల్ గా తిలకించాలని తెలిపారు. తెలిపారు.జగ్గంపేట నియోజకవర్గంలోని క్లస్టర్ -1 వర్చువల్ మహానాడును క్లస్టర్ లోని నాయకులందరూ సమిష్టిగా విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు..కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పోటీ పడుతూ మహానాడు విజయవంతనికై ప్రతీ ఒక్కరూ ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875క్లస్టర్లలో స్థానిక నాయకత్వం సమర్థవంతంగా నిర్వహించి, తమ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచుకోవడం జరిగిందని కన్నబాబు తెలిపారు. నాయకులు సమిష్టి వలనే మహానాడు విజయానికి ప్రధాన కారణమన్నారు. శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చేతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని,ప్రతి కార్యకర్త ,నాయకుడు సగర్వంగా చెప్పుకునే విధంగా పాలన కొనసాగిస్తున్నారని ఇదే మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ టిడిపి బలోపేతానికై ప్రతి కార్యకర్తకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని కన్నబాబు తెలిపారు.

## ఈసెట్‌లో మౌలాలి యువతి సత్తా

### - రాష్ట్ర స్థాయిలో మెరిసిన తనుకు పూజిత





**కాప్రా,మే29.అక్షర టైమ్స్:-** తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీఈసెట్-2026)లో మౌలాలి ప్రాంతం ఎంజే కాలనీకి చెందిన తనుకు పూజిత ప్రతిభ చాటింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పరీక్ష రాసిన ఆమె 200 మార్కులకు గాను 145 మార్కులు సాధించి అర్హత పొందింది.ఇంటిగ్రేటెడ్ ర్యాంక్‌లో 22వ స్థానం, బ్రాంచ్ ర్యాంక్‌లో 10వ స్థానం సాధించి కుటుంబ సభ్యులు, అధ్యాపకులకు గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం ఆమె కంప్యూటర్ ఇంజినీరింగ్ ( సి ఎం ఈ) డిప్లొమా పూర్తి చేసింది.ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ అధ్యాపకుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాన్ని సాధించగలిగానని తెలిపింది. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమేనని ఆమె పేర్కొంది.పూజిత తండ్రి దశరథ రాములు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఆమె చదువులో ప్రతిభ కనబరుస్తూ వస్తోందన్నారు. పదో తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలవడంతో పాటు రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంకు సాధించి అప్పుడే తన ప్రతిభను చాటిందన్నారు. ఇప్పుడు ఈసెట్‌లో కూడా అద్భుత ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.పూజిత విజయంపై బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

## ఈదులకుంట చెరువు పరిరక్షణలో 'సిపిఐ' సుదీర్ఘ పోరాటం ఫలించింది

### - కబ్జాదారుల నుంచి రూ.కోట్ల విలువైన చెరువు భూమి సేఫ్
### - రంగంలోకి దిగి అడ్డుకున్న 'హైడ్రా'..
### - హర్షం వ్యక్తం చేసిన కమ్యూనిస్టు నాయకులు




**శేరిలింగంపల్లి,మే29.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో ఉన్న సుమారు 6 ఎకరాల 5 గుంటల ఈదులకుంట చెరువు భూమిని కబ్జా నుంచి కాపాడడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చేసిన సుదీర్ఘ పోరాటం ఎట్టకేలకు ఫలించింది.తారుమారు కుట్రలను బట్టబయలు చేసిన సిపిఐ కోట్ల రూపాయల విలువైన ఈ చెరువు భూమిని, సర్వే నెంబర్లను తారుమారు చేసి ఆక్రమించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నించాయి. అక్కడ జరుగుతున్న సెల్లార్ తవ్వకాల పనులను సిపిఐ నాయకులు సకాలంలో గుర్తించి, అడ్డుకున్నారు. ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**నాయకుల పోరాట పటిమ:**

చెరువు రక్షణ కోసం ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్, మరియు ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అవసరమైతే ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని, అసెంబ్లీలో సైతం ఈ అంశాన్ని లేవనెత్తుతామని అప్పట్లో హెచ్చరించారు.హైడ్రా జోక్యంతో ముగింపు అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేనప్పటికీ, చివరకు హైడ్రా (న్ణ=ూూూ) జోక్యంతో ఈ చెరువు భూమి ఆక్రమణల నుంచి పూర్తిగా విముక్తమైంది. దీనిపై స్థానిక ప్రజలు, సిపిఐ నాయకులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలం లోపు చెరువును సుందరీకరించి, పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ధన్యవాదాలు మరియు విప్లవ శుభాకాంక్షలు :**

చెరువు పరిరక్షణ కోసం కలిసి నడిచిన ప్రజలకు, ప్రింట్ ఉ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, మరియు కార్యకర్తలకు సిపిఐ పార్టీ తరపున విప్లవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు పానుగంటి పర్వతాలు (సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు) , టి. రామకృష్ణ (సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు),కే. చందు యాదవ్ (సిపిఐ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి), కే. వెంకటస్వామి, కే. సుధాకర్, జెట్టి శ్రీనివాస్ (సిపిఐ జిల్లా సమితి సభ్యులు), కోన సుధాకర్ (మండల సహ కార్యదర్శి),తుపాకుల రాములు (మండల నాయకుడు), ఎస్. నారాయణ (మండల ఎఐవైఎఫ్ అధ్యక్షుడు), రఘు తదితరులు.

## మయూరి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### - తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**మియాపూర్/డివిజన్,మే 29.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** పరిధిలోని మయూరి నగర్ కాలనీ వాసులు కాలనీలో ఎదుర్కొంటున్న పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు తమ సమస్యలను శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

**ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్యమైన వ్యాఖ్యలు:**

స్వయంగా పర్యటించి పరిశీలిస్తానని త్వరలోనే మయూరి నగర్ కాలనీలో స్వయంగా పర్యటించి, అక్కడి సమస్యలను పరిశీలించి విడతలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో అభివృద్ధి: ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో డివిజన్లో అత్యవసరంగా ఉన్న చోట, నిత్యం సమస్యలతో సతమతమవుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మౌలిక వసతులే ప్రథమ లక్ష్యం: మయూరి నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడమే తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి వస్తే తప్పకుండా పరిష్కరిస్తానని చెప్పారు. నాణ్యతలో రాజీ పడబోము: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతాం: పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరతామన్నారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, మియాపూర్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ఒక ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రముఖులు: ఈ కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీ ప్రతినిధులు: కే. రామరాజు (కాలనీ అధ్యక్షులు),కిషోర్,ప్రవీణ్ రెడ్డి,రమణ రెడ్డి,రవీంద్ర వర్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం "డ్రై డే"గా పాటించాలి

### - దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం



**కాప్రా,మే29.అక్షర టైమ్స్:-** ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా వంపుగూడ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.కాప్రా సర్కిల్ డిసి డిసి శ్రీహరి ఏంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలను మరింత వేగవంతం చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందితో పాటు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా సాయిబాబా నగర్ ప్రజలకు దోమల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా దోమ గుడ్డు నుండి లార్వా దశ వరకు దోమగా ఎలా మారుతుందో మొబైల్ వీడియోలు, ఫ్లిప్ బుక్స్ సహాయంతో వివరించారు. ఏంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగిస్తూ ప్రజలకు సూచనలు అందించారు.ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులు,డ్రమ్ములు, కూలర్లు,పాత టైర్లు,పూల కుండీలు, కొబ్బరి బొండాలు వంటి వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాలనీలు,బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలలో కాలనీ సంక్షేమ సంఘాలు,మహిళా సంఘాలు, మున్సిపల్ అధికారుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఎంటమాలజి ఏఈ డి.రమేష్ లు మాట్లాడుతూ దోమల నివారణ ప్రతి పౌరుని బాధ్యత అని,దోమల రహిత నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు తమ ఇళ్లలో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకో వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్,ఏంటమాలజీ,సిబ్బంది పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిపై ఢిల్లీ దృష్టి..

### - రాహుల్‌తో మరబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక భేటీ



**కొండాపూర్,మే29.అక్షర టైమ్స్:-** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ అధిష్టానం వ్యూహాలకు పదును పెడుతున్న వేళ, శేరిలింగంపల్లి నియోజకవర్గ రాజకీయాలపై ఢిల్లీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ యువ నాయకుడు, స్వర్గీయ మరబోయిన సత్య నారాయణ యాదవ్ కుమారుడు మరబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ భేటీలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలు, స్థానిక స్థాయిలో కార్యకర్తల పరిస్థితులపై రాహుల్ గాంధీ ఆరా తీశారు. పార్టీ కోసం స్వర్గీయ సత్యనారాయణ యాదవ్ చేసిన సేవలను అనిల్ కుమార్ యాదవ్ వివరించినట్లు సమాచారం. గతంలో శేరిలింగంపల్లిలో జరిగిన భారీ సభను కూడా రాహుల్ గాంధీ ప్రస్తావించినట్లు తెలిసింది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అనిల్ కుమార్ యాదవ్‌కు ప్రాధాన్యత ఇస్తుండగా, ఇప్పుడు రాహుల్ గాంధీతో జరిగిన ఈ ప్రత్యేక భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీకి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రాహుల్ గాంధీని కలిసిన అనంతరం అనిల్ కుమార్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ క్షేత్రస్థాయి అంశాలపై నేరుగా చర్చించే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సమావేశానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

## బోనకల్ మండల కేంద్రంలో ఐదవ రోజు కొనసాగిన వివోఏ ల సమ్మె

**బోనకల్,మే29.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** సమస్యల పరిష్కారానికై ఐకెపి వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు బోనకల్ మండల వివోఏ అధ్యక్షురాలు బోయినపల్లి దివ్య మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న స్వల్ప వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ వర్తింపు చేయాలని,అర్హులైన వివోఏ లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని,సాధారణ , ఆరోగ్య భీమా సౌకర్యం రూ. 20 లక్షలు కల్పించాలని, 58వ జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మండల ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో బోనకల్ మండలనికి చెందిన వివోఏలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండలం ఏపిఎం కొట్టె వెంకటేశ్వర్లు, సీసీ నాగమణి, శిరోమణి, వెంకట్ రావమ్మ, అకౌంటెంట్ రత్నకుమారి, కంప్యూటర్ ఆపరేటర్ రవి, హెచ్చిసి సీఈవో సాయి, వివోఏ మండల సంఘం మండల అధ్యక్షులు బోయినపల్లి దివ్య, ఉపాధ్యక్షులు మీరాబి , కార్యదర్శి దారెల్లి దివ్య , కోశాధికారి ఉష,సహాయ కార్యదర్శి ప్రమీల,మరియు వివోఏల సంఘం సభ్యులు సజ్జన, కృష్ణవేణి, శ్రావణి, శాంతి, రమాదేవి, వివో ఏ పైడిపల్లి కృష్ణ, వివో ఏ బలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



**శేర్లింగంపల్లి,మే29.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తూ, నియోజకవర్గ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మన శేరిలింగంపల్లి శాసనసభ్యులు పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ కి మరియు వారి ధర్మపత్ని శ్యామల దేవి కి వివాహ వార్షికోత్సవ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ జేసారు. ఒకరికొకరు తోడై, నీడై ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న ఈ దంపతులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ల పాటు ఇలాగే సంతోషంగా వర్ధిల్లాలని, ఆ భగవంతుని ఆశీస్సులు వీరికి ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నరు.

## మురుగు, తాగునీటి సమస్యలపై కప్పర సాయి కిరణ్ గౌడ్ ప్రత్యేక దృష్టి





**మల్లాపూర్,మే29.అక్షర టైమ్స్:-** ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీలో అపార్ట్‌మెంట్‌ల వరుస ప్రాంతంలో తీవ్ర మురుగునీటి సమస్యతో పాటు తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలు పొంగిపొర్లడంతో రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోగా, దుర్వాసనతో ప్రజలు ఇళ్ల బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు తాగునీరు సరిగా రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ సంబంధిత నీటి సరఫరా శాఖ అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారి వేణుగోపాల్, సహాయ ఇంజినీర్ రోహిత్‌లతో కలిసి కాలనీలో పర్యటించి మురుగునీటి నిల్వలు, మూసుకుపోయిన కాలువలు, తాగునీటి సరఫరా లోపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కప్పర సాయి కిరణ్ గౌడ్, సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారంతో నివారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శేఖర్, సంపత్, శ్రీకాంత్, సంతోష్, వినేష్, మధు, రాము తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు అండగా మాజీ మంత్రి కాకాణి

### - మర్యాదపూర్వకంగా కలిసిన పొదలకూరు పట్టణ ముస్లిం సోదరులు





**పొదలకూరు,మే29.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్:** బక్రీద్ పర్వదినాన మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ని బక్రీద్ పర్వదినాన పొదలకూరు పట్టణ ముస్లిం సోదరులుమర్యాద పూర్వకం గా కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో గోవర్ధన్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.నాడు రంజాన్ పండుగ జరుపుకోవడానికి కరోనా టైం లో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి 7వేల ముస్లిం కుటుంబాలకు పండుగ సరుకులను పంపిణీ చేశారన్నారు.అలాగే ఈద్గా మరియు ముస్లిం బరియల్ గ్రౌండ్ కు 25 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మించారన్నారు. నాడు పేద ముస్లిం కుటుంబాలు పెళ్లిళ్లు చేసుకోవడానికి షాదీ మంజిల్ ను 18 లక్షల రూపాయలు వెచ్చిచ్చి పునర్నిర్మించి,ముస్లిం కుటుంబాలకు అంకితంచేశారన్నారు.అన్ని వర్గాల ప్రజలతో పాటు ముస్లింలకు అండగా నిలిచిన కాకాణి గోవర్ధన్ రెడ్డి ని కలవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్.కె అంజాద్, ప్రస్తుత ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యులు షేక్ దస్తగిరి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిలాని,సిరాజ్,ఆరిఫ్,అమానుల్లా, జమీర్ యస్దాని,సమద్,ఇబ్రహీం,జునేద్, తౌహీద్ షఫీ ముక్తహర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశం



**శేర్లింగంపల్లి,మే29.అక్షర టైమ్స్:-**ప్రతినిధి : శేరిలింగంపల్లిలో గురువారం నాడు జరిగిన గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గ సమావేశంలో నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మెపై సుదీర్ఘంగా చర్చించారు.?అసోసియేషన్ ప్రతినిధుల డిమాండ్లు మరియు సూచనలు తెలియజేస్తూ

**సమ్మె విరమించాలి:**

ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్లు పెంచమనడం సమంజసం కాదని, నిర్మాణ రంగ ఇబ్బందులను గుర్తించి సమ్మె విరమించాలని అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు కోరారు.

**చిన్న బిల్డర్ల ఇబ్బందులు:**

అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాల వల్ల మెటీరియల్ ధరలు పెరుగుతున్నాయని, దీనికి తోడు ఈ సమ్మె వల్ల చిన్న బిల్డర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రెసిడెంట్ రాజా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.?

**ఎస్.ఎఫ్.టి (SFT) రేట్లు:**

మార్కెట్ విలువలను పెంచే ప్రభుత్వ ప్రయత్నాలు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఎస్ఎఫ్టీ రేట్లు పెరగకుండా చూడాలని ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ట్రాన్స్ఫార్మర్లు ఒ రిజిస్ట్రేషన్ చార్జీలు:**

బిల్డింగ్ పూర్తయినా ట్రాన్స్ఫార్మర్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాబట్టి వాటిని 'ఆక్యుపెన్సి సర్టిఫికెట్' (రాజ) తో ముడిపెట్టకుండా ఇవ్వాలని జనరల్ సెక్రెటరీ పి.బి.ఎస్. విశ్వనాథ్ కోరారు.?గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం తగ్గించినట్లుగానే, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీల శాతాన్ని తగ్గించి కష్టమర్లకు ఊరట నివ్వాలని డిమాండ్ చేశారు.

**లేబర్ సెస్ నుండి న్యాయం:**

ప్రభుత్వం బిల్డింగ్ పర్మిషన్ సమయంలో వసూలు చేసే 'లేబర్ సెస్' నుంచే సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని టెక్నికల్ అడ్వైజర్ సుమా రామకృష్ణ సూచించారు.నిర్మాణ రంగాన్ని సంక్షోభం నుండి కాపాడటానికి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు (పులి మురళి, ఉపేందర్ రెడ్డి, చక్రపాణి తదితరులు) ఈ సమావేశం ద్వారా కోరారు.

## గంగల రాధాకృష్ణ యాదవ్‌కు ఘనంగా జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,మే29.అక్షర టైమ్స్:-ప్రతినిధి :** రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, మాదాపూర్ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ గంగల రాధాకృష్ణ యాదవ్ జన్మదినం మరియు వివాహ వార్షికోత్సవ వేడుకలు మాదాపూర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాదాపూర్‌లోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.రాధాకృష్ణ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, గజమాల వేసి జన్మదిన మరియు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ బలోపేతానికి నిరంతర కృషి చేస్తానని రవికుమార్ యాదవ్ ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ..గంగల రాధాకృష్ణ యాదవ్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవలు అందిస్తూ, కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, పార్టీకి ఆయన చేస్తున్న కృషి భవిష్యత్తులో ఆయనను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు."ప్రజాసేవలో నిరంతరం ప్రజల కోసం పాటుపడే రాధాకృష్ణ యాదవ్ ఎల్లవేళలా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను. ఇటువంటి ఆనందకరమైన పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో మరింత ఉన్నతమైన స్థానాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.రవికుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈ ఆనందకరమైన సందర్భంలో రాధాకృష్ణ యాదవ్ దంపతులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు.హాజరైన ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్, వరలక్ష్మీ ధీరజ్, సీనియర్ నాయకులు సుమన్, శ్రీధర్, రాకేష్ మరియు పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాధాకృష్ణ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధ్యాయుడి చొరవ - ఆ బడికి పునర్జన్మ

- గుడి హుండీ నుంచి నిధులు

- సర్పంచ్ సహకారంతో మారిన పాఠశాల రూపురేఖలు





**పొదలకూరు,మే29.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** ఉపాధ్యాయుడి చొరవ, ఊరి ఐకమత్యం, సర్పంచ్ దాతృత్వం, గుడి హుండీ నిధులు.. ఓ ప్రభుత్వ పాఠశాల భవనానికి ఊపిరి పోశాయి. ఈ ఉదంతం చేజర్ల మండలం చీర్ల వారి కండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్వాపరాలిలా ఉన్నాయి.ఒక ఉపాధ్యాయుడి చొరవతో ప్రారంభమైన ప్రయత్నం చివరకు గ్రామమంతా భాగస్వామ్యమై విజయవంతమైంది.శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో అన్న భయంతో ఉన్న పాఠశాల భవనం కొత్త విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి విద్యార్థుల కేరింతలతో కళకళలాడనుంది.

**నిధుల కొరతతో మధ్యలోనే ఆగిన భవనం.**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకంలో భాగంగా చీర్లవారికండ్రిక ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనం మంజూరైంది.అయితే నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు పూర్తి కాలేక మధ్యలోనే ఆగిపోయాయి.దీంతో గ్రామంలోని పాత పాఠశాల భవనంలోనే విద్యాబోధన కొనసాగించాల్సి వచ్చింది.అయితే ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గోడల నుంచి పెచ్చులు ఊడిపడటం, పైకప్పు ఉరుస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య తరగతులకు హాజరయ్యేవారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారేది. తరగతులను నిర్వహించేందుకు ఎదురుగా ఉన్న ఆలయంలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడేది.

**"మన బడిని మనమే కాపాడుకోవాలి"**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టిన పుచ్చకట్ల మల్లికార్జునరావు సమస్యను సీరియస్‌గా తీసుకున్నారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులతో సమావేశమై "మన ఊరి బడిని మనమే కాపాడుకోవాలి" అంటూ చైతన్యం కలిగించారు.ఆయన మాటలకు గ్రామస్థులు స్పందించి పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చారు.

**గుడి హుండీ నిధులతో ప్రారంభమైన మరమ్మతులు**

గ్రామ దేవాలయ హుండీలో ఉన్న రూ.21 వేల కానుకలను పాఠశాల మరమ్మతులకు వినియోగించాలని గ్రామస్థులు నిర్ణయించారు.దీంతో భవన మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి.అనంతరం పనులు పూర్తి చేసేందుకు ఉపాధ్యాయుడు మల్లికార్జునరావు స్వయంగా రూ.20 వేలు అందించారు.గ్రామ సర్పంచ్ పంచాయతీ నిధులు మరో రూ.20 వేలు సమకూర్చి అండగా నిలిచారు.

**శ్రమదానంతో మారిన పాఠశాల రూపు**

కేవలం నిధులు సమకూర్చడమే కాకుండా గ్రామస్థులు శ్రమదానం కూడా చేశారు. కొందరు గోడలకు మరమ్మతులు చేయగా, మరికొందరు పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. మహిళలు కూడా తమ వంతు సహకారం అందించారు. అందరి కృషితో ప్రమాదకరంగా ఉన్న భవనం ఇప్పుడు విద్యార్థులకు సురక్షితమైన పాఠశాలగా మారింది. "మన ఊరి పిల్లలు మన ఊరి బడిలోనే చదవాలి" అనే భావనతో గ్రామస్థులంతా పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు సిద్ధమయ్యారు.

**స్ఫూర్తిగా నిలిచిన చీర్లవారికండ్రిక**

ఒక ఉపాధ్యాయుడి సంకల్పం, గ్రామ ప్రజల ఐకమత్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలలను ఎంతగానో అభివృద్ధి చేయవచ్చని చీర్లవారికండ్రిక గ్రామం నిరూపించింది.

# సేవా స్ఫూర్తికి చిరునామా పులిపాటి


- 11 మంది పేద విద్యార్థులకు విద్యా విరాళాలు... ఆదర్శంగా పులిపాటి దంపతులు

- పులిపాటి ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

- ప్రజాసేవే లక్ష్యంగా పులిపాటి దంపతుల సేవా కార్యక్రమాలు

- కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి





**ఖమ్మం,మే29.అక్షర టైమ్స్:-** బ్యూరో : ఖమ్మం నగరంలో ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ మరియు పద్మప్రియ దంపతుల జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. నగరంలోని ఖమ్మం పౌరసమితి ప్రధాన కార్యాలయం, స్టేషన్ రోడ్డులోని డాక్టర్ పులిపాటి ప్రసాద్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సవ వాతావరణాన్ని తలపించాయి. భారీ కేక్ కటింగ్‌తో పాటు నిరుపేదలకు మహా అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ, రోగులు మరియు ప్రజలకు పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ, ఒకే రోజు పులిపాటి ప్రసాద్ , పద్మప్రియ దంపతుల జన్మదినోత్సవం జరగడం అరుదైన విశేషమని అన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న ఈ దంపతులు మరెన్నో జన్మదినోత్సవాలు జరుపుకుంటూ సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.లక్షలాది మంది విద్యార్థులకు నర్సింగ్ విద్యను అందిస్తూ, తెలంగాణ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరింపజేస్తున్న డాక్టర్ పులిపాటి ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని దీపక్ చౌదరి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.పులిపాటి దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ, నిరుపేదలకు పెద్దన్నయ్యగా, విద్యార్థులకు మార్గదర్శకులుగా, సమాజానికి సేవలందిస్తూ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. ఖమ్మం నగరంలో జరిగిన ఈ జన్మదిన వేడుకలు ప్రజల ఆదరణతో నిజమైన ప్రజా ఉత్సవంగా నిలిచాయి.

**ఖమ్మంలో వేడుకలు ఘనంగా..**

ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదగా ది.12-05-2008 న వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్న డా"పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి ఉదయం 7 గంటలకు గొల్లగూడెం శంకర మఠం దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 8:30 గంటలకు శ్రీకృష్ణ గోశాలలో గోవులకు గోపూజ, గోగ్రాసం సమర్పణం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం 8:30 గంటలకు రోగులకు పండ్ల పంపిణీ, స్టేషన్ రోడ్ లో పౌరసమితి కార్యాలయంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమా లు జరిగాయి.11 నుంచి - మధ్యాహ్నం 12:30 మధ్య స్టేషన్ రోడ్, డా"పులిపాటి ప్రసాద్ కాంప్లెక్స్లో మహా అన్నదానం, పేదలకు వస్త్రదాన కార్యక్రమం,7:00 డా"పులిపాటి ప్రసాద్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు సంబరంగా జరిగాయి. పేద విద్యార్థులు 11 మందికి ఉచిత విద్యా విరాళం కార్యక్రమం జరిగింది.

**అతిథుల సందడి..**

ఖమ్మం పౌర సమితి వ్యవస్థాపకులు పులిపాటి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్- పద్మప్రియ దంపతుల జన్మదిన వేడుకలు ఖమ్మం పులిపాటి కాంప్లెక్స్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం పౌర సమితి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి సీతచంద్రరావు ఖమ్మం పౌర సమితి సభ్యులు హాజరైనారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.డాక్టర్ పులిపాటి ప్రసాద్ పద్మప్రియ దంపతుల జన్మదిన సందర్భంగా పులిపాటి కాంప్లెక్స్ వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షులు నాగడ్ల దీపక్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పౌర సమితి నాయకులు గుమ్మడవెల్లి శ్రీనివాస్, పాల్వాయి వెంకటేశ్వర్లు, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, మాశెట్టి వరప్రసాద్, అపోవా కృష్ణమూర్తి, కొదమూరు జగన్నాథం, కొంకిమళ్ళ మృత్యుంజయ గుప్త, సిద్ధంశెట్టి శ్రీకాంత్, బొగ్గవరపు సతీష్, కొదుమూరి భద్రయ్య, టి. సంతోష్ చక్రవర్తి, చెరుకూరి రాజీ, కందిబండ భిక్షమయ్య, ధనుంజయ, డి శ్రీనివాస్, పుల్లారావు, డోకుపర్తి సుబ్బారావు, వివి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ కూరాకుల వలరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నపూర్ణ, దామ స్వరూప, జ్యోతి, ప్రతిభ రెడ్డి, రామకృష్ణ, శ్రీకాంత్, కోసూరు ప్రసాద్, కోనేటి నారాయణ, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, పాల్వంచ రామారావు, పులిపాటి కళాశాల సిబ్బంది శ్రీకాంత్, నీరజ, ప్రతాప్, శ్వేత, సాయి శ్రీ, వసంత, లాల్ బీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే తో కలిసి పరిశీలించిన జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

- పలువురు వద్ద అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





**కావలి,మే29,.క్షర టైమ్స్: :** కావలి పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వసతి, టాయిలెట్లు, డిపోలో అమ్ముతున్న వస్తువుల నాణ్యత తదితర అంశాలపై కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి కలిసి డిపో ప్రాంగణాన్ని పరిశీలించి ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యలు, అవసరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ డిపో ప్రజలకు ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే ఈ డిపో ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు సేవలు పొందుతున్నారని తెలిపారు. మహిళా శక్తి పథకం అమలులోకి వచ్చిన తర్వాత మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయని, ఇప్పటివరకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఈ డిపో ద్వారా రాకపోకలు సాగించారని వెల్లడించారు. ఈ సేవల ద్వారా ఆర్టీసీకి రూ.27 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ సహకారంతో రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువు మానేయకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత బస్సు పాసులు అందిస్తూ ఆర్టీసీ సేవలను విద్యార్థులకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. కావలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలు విస్తరించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త రూట్లు, కొత్త బస్సులు, అదనపు సదుపాయాలు తీసుకురావాలని అధికారులతో చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నారని అభినందించారు. డిపోలో శానిటేషన్ సమస్యలు, తాగునీటి సమస్యలు, టాయిలెట్ల నిర్వహణ వంటి అంశాలపై కూడా ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు సమన్వయంతో డిపో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ డిపోలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ సీఐ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యేక బృందాలు రాత్రి 12 గంటల వరకు డిపో వద్ద గస్తీ నిర్వహిస్తున్నాయని చెప్పారు. ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సూచనలు, ప్రయాణికుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కావలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి అవసరమైన బస్సులు, సిబ్బంది, ఇతర సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు డిపోలో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాత టాయిలెట్ల స్థానంలో కొత్త సదుపాయాలు ఏర్పాటు చేయడం, డిపోలో పరిశుభ్రత, పెయింటింగ్ తదితర అంశాలపై అధికారులు చర్యలు చేపడతారని చెప్పారు. ఎమ్మెల్యే సూచించిన అన్ని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో సొంత ఖర్చుతో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా





**పొదలకూరు,మే29.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** పొదలకూరు పట్టణంలోని శివాలయం వీధి, ఎరుకల వీధిలో శుక్రవారం తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయితీ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు నీటి కోసం ఆందోళన చెందారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చొరవతో పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు ఆదాల సుగుణ స్పందించి తన సొంత ఖర్చుతో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి కాలనీవాసులకు తాగునీటిని సరఫరా చేయించారు.స్థానికుల సమాచారం మేరకు పైప్‌లైన్లలో పూడిక పేరుకుపోవడంతో పాటు మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ఆ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిసింది.దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆదాల సుగుణ వెంటనే స్పందించి ట్యాంకర్ ద్వారా నీటిని పంపించారు. ట్యాంకర్ వచ్చిన వెంటనే మహిళలు పాత్రలతో నీటిని తీసుకెళ్లారు. త్వరితగతిన పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించి, మోటార్ల మరమ్మతులు పూర్తి చేసి సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆదాల సుగుణ తెలిపారు.

## పక్షులకు తాగునీటిని, ఆహారాన్ని అందుబాటులో ఉంచుదాం

- సిఆర్పిఎఫ్ సీనియర్ సబ్ ఇన్స్పెక్టర్ అంకారావు




**పెదకూరపాడు,మే29.అక్షర టైమ్స్:-** పక్షులకు తాగునీటి ని,ఆహారాన్ని అందుబాటులో ఉంచుదామని అస్సాం రాష్ట్రంలోని గోలాఘాట్ జిల్లా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీనియర్ సబ్ ఇన్స్పెక్టర్ (సిఆర్పిఎఫ్)ఇంటూరి అంకారావు అన్నారు.పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం పక్షులకు నీరు,పక్షులకు గిన్నెలలో ఆహారం, పక్షులగూళ్ళుపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన పోస్టర్లను సబ్ ఇన్స్పెక్టర్ అంకారావు సంస్థ ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు పక్షులు విలవిలలాడుతున్నాయని పక్షులకు గిన్నెల్లో నీరు పోసి, గింజలు వేస్తే వాటి ప్రాణానికి ఊపిరి పోసిన వారమవుతామని అన్నారు. సృష్టిలో ప్రతి జీవికి జీవించే హక్కు కల్పిద్దామని,పక్షుల కోసం గూళ్ళను ఏర్పాటుచేసి నీటిని,ఆహారాన్ని అందుబాటులో ఉంచుదామన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా పెదకూరపాడులో మూడు ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నమని,పక్షుల కోసం కూడా గూళ్ళను, గిన్నెలో నీటిని,ఆహారాన్ని అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధులు షేక్ సుభాని,గుడిపూడి బ్రహ్మనాయుడు,రవి,చెంబేటి వీరబాబు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# జన గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా చేపట్టాలి

### కలెక్టర్ పి. రాజాబాబు



**ఒంగోలు,మే29.అక్షర టైమ్స్:–** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తి మేరకు పని చేయడమే అధికారుల, లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సానుకూల ప్రజాభిప్రాయం (ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ పై), ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార పురోగతి, జిల్లా లో చేపడుతున్న జనగణన ప్రక్రియ పురోగతి, రీ సర్వే, స్కూల్ ఎన్రోల్మెంట్, పిఎం.కుసుం, పిఎం సుర్యఘర్, పెన్షన్స్ పంపిణీ, హౌసింగ్ ప్రోగ్రాం, జల ధార– జల హారతి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తి మేరకు అధికారులు పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఐ.వి.ఆర్.ఎస్ సర్వే లో సైతం కొంత వెనుకబాటు కనబడు తుందని దాన్ని సరి చేసుకోవాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చిన ప్రతి వినతిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టి బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లో చేపట్టిన జనగణన ప్రక్రియను ఎలాంటి పోరాపాట్లుకు తావివ్వకుండా పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, సెన్సస్ అధికారులను ఆదేశించారు. జనగణనలో ప్రతి ఒక్కరి వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షం ద్వారా కురిసే ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవడం జలధార – జలహారతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని, ఈ కార్యక్రమం కింద చేపట్టే పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.




## ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్


**18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు**

**ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి**

**2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్**

**నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు**

**విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**





**అమరావతి,మే 29.అక్షర టైమ్స్:–** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్–3 లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ–డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈపీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్–3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను... అలాగే పంప్ట్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్ధ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

### పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి...

సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్ధ్యంతో ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు తెలిపారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని... అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళు అమర్చామని.. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ' సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్––మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### సీఎంను కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం...

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవెల్యూషన్– సి 4 ఐఆర్ అమలు చేయాల్సిన కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. సి4 ఐఆర్ ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కో–వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై సి4 ఐఆర్ అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సి4 ఐఆర్ కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియేంటేషనుతో సి4 ఐఆర్ పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని సి 4 ఐఆర్ కు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 2025 డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి









**ఒంగోలు,మే 29.అక్షర టైమ్స్:–** 2025 డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జి లేదా సిబిఐ తో విచారణ జరిపించాలని దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టూడెంట్ వింగ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అనేక డీఎస్సీ లో నిర్వహించారని ఎప్పుడు ఇటువంటి సమస్యలు రాలేదని అన్నారు. 16, 347 పోస్టులు కోసం మూడు లక్షల 36వేల మంది నిరుద్యోగులు రాత్రి అనక, పగలనకా కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం రావాలి అని చదువుకొని పరీక్షలు రాస్తే కావాలని నీకు డబ్బులు ఇచ్చిన వారికి ఒక్కో పోస్టు 15 లక్షల రూపాయలకు అమ్ముకొని వారికి మాత్రమే మెసెజ్ లు పంపించి పోస్టులు భర్తీ చేశారు అని అన్నారు. డీఎస్సీ పోస్టులను పప్పు బెల్లం ల అమ్మకున్నారు అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేష్ విద్యాశాఖ మంత్రి గా ఉండి అక్రమాలకు పాల్పడిన వారిని, అక్రమాలు చేసిన వారిని శిక్షించకుండా 200 మంది బాధితులు కోర్ట్ కి వెళితే వారిని బెదిరిస్తున్నారని అన్నారు. ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అని అన్నారు. 2% వున్న స్పోర్ట్స్ కోటాను 3% పెంచి అక్రమాలకు తెర లేపారని అన్నారు. కావున 2025 డీఎస్సీ లో అర్హులైన వారికి న్యాయం చేయాలి అని డీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జి తో విచారణ లేదా సిబిఐ తో విచారణ జరిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు. యుద్ధం కారణం చూపి స్కూల్ పిల్లకు పంపిణి చేయాల్సిన కిట్ లను ప్రభుత్వం ఆపాలనే కుట్ర చేస్తున్నారు అని వెంటనే స్కూల్ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం లోనే కిట్లు పంపిణి చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి, రాష్ట్ర ప్రచార వింగ్ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర రావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు రవీంద్రా రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కటారి శంకర్, జిల్లా ప్రచార వింగ్ అధ్యక్షులు శేషా రెడ్డి, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు మరియు పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి నుంచి విముక్తి

### 10 మందికి రిలీఫ్ సరిఫికెట్లు ఇచ్చిన కలెక్టర్, జేసీ.





**ఒంగోలు,మే 29.అక్షర టైమ్స్:–(బ్యూరో, షేక్. కరిముల్లా) :** దాదాపు 11 ఏళ్ల నుంచి సుబాబుల్ కర్ర నరికే పనిలో వెట్టిచాకిరి చేస్తున్న 10 మందికి కలెక్టర్ పి.రాజాబాబు విడుదల కల్పించారు. శుక్రవారం కొరిశపాడు మండలం, పి.గుడిపాడు గ్రామంలో నిర్వహించిన ' పల్లె నిద్ర ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తో కలిసి రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. వీరికి సంబంధిన వివరాలను అధికారులు ఈ సందర్భంగా వివరించారు. కొత్తపట్నం మండలం, అల్లూరు గ్రామానికి చెందిన 3 గిరిజన కుటుంబాలు తాళ్లూరు మండలం, వెలిగూరిపాడు గ్రామానికి చెందిన సుబాబులు తోట కలిగిన శ్రీనివాసులు రెడ్డి అనే రైతు వద్ద వెట్టి చారికీ చేస్తున్నారు. 11 ఏళ్ల క్రితం వీరికి రూ.20 వేలు ఇచ్చి, ఆ డబ్బులను జమ చేసుకునే పేరుతో వీరితో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు గిరిజన సంఘాల నాయకుల ద్వారా అధికారులు గుర్తించారు. అనంతరం బాధితులను విడిపించి, కలెక్టర్ ఆదేశాల మేరకు పునరావాస కల్పనకి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జాన్సన్, డీ.పీ.వో. వెంకటేశ్వర రావు, జెడ్పీ సీ.ఈ.వో. చిరంజీవి, ఇతర అధికారులు, యానాది మహా కూటమి రాష్ట్ర కమిటీ సభ్యుడు చేవూరి వెంకటేశ్వర్లు, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కాలిపోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన వైఎస్ఆర్ సీపీ నాయకులు



**అర్థవీడు,మే 29.అక్షర టైమ్స్:–**అర్థవీడు మండలం, నాగులవరం గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం అయ్యి నివాసం కోల్పోయిన ఆ కుటుంబానికి అండగా గ్రామ వైఎస్సార్సిపి నాయకులు అందరి సహకారంతో మూడు లక్షల రూపాయలు విరాళంగా సేకరించి ఇంచార్జి కె.పి. నాగార్జున రెడ్డి సమక్షంలో బాధితులకు డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ విరాళాలు అందజేసిన దాతలందరికి అభినందనలు మరియు ధన్యవాదాలు తెలియజేసారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 100% అడ్మిషన్ లక్ష్యంతో ముందుకు సాగాలి

### ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**గిద్దలూరు,మే 29.అక్షర టైమ్స్:–** మార్కాపురం నూతన జిల్లా డిఈవో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంచేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు.

# జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఒంగోలు,మే 29.అక్షర టైమ్స్:–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హర్షిణి డిగ్రీ కళాశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో , ఒంగోలు నందు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలైన, ఆక్సిస్ బ్యాంకు , హెటిరో డ్రగ్స్, డాక్టస్ బిజినెస్ సోలుషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , ఇండో సోలార్ ప్రవేట్ లిమిటెడ్ , జే కే టైర్స్ , టాటా ఎలక్ట్రకిన్స్, చోళ గోల్డ్ లోన్ ప్రతినిధులు హాజరవడం జరిగింది. ఈ కంపెనీలకు (287) మంది హాజరుకాగా వారిలో 112మంది కంపెనీలకు ఎంపిక అవడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే.రవితేజ , కళాశాల ప్రిన్సిపాల్ దండే ఆంజనేయులు తెలియజేశారు. కళాశాల చైర్మెన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు నిర్వహించే జాబ్ మేళా లను మరియు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, అదే విధంగా హాజరైన యువత అందరూ వారి వారి విద్యార్హత మరియు వారి అనుభవాన్ని బట్టి ఉద్యోగాలు పొంది మంచి అత్యుత్తమైన స్థానాలు పొందాలని ఇటువంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధి అధికారి రమాదేవి , స్కిల్ దెవలప్మెంట్ సిబ్బంది మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



# గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్



**గిద్దలూరు,మే29.అక్షర టైమ్స్:–** గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్వయంగా ప్రజల నుంచి వినతులను తీసుకుంటారు. కావున గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే కి స్వయంగా వచ్చి తెలియజేయవచ్చును.

# టిడిపి కార్యాలయం లో ప్రకాశం జిల్లా స్త్రీశక్తి సంబరాలు









**దర్శి,మే 29.అక్షర టైమ్స్:-** ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డు టీడీపీ కార్యాలయం నందు శుక్రవారం తెలుగు మహిళలు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి ప్రకాశం జిల్లా తెలుగు మహిళలు పాలాభిషేకం మరియు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా టీడీపీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి , దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్. గొట్టిపాటి లక్ష్మీ, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కార్పొరేషన్ చైర్మన్ పొడపాటి తేజస్విని , జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తానని లోకేష్ అన్న ప్రకటించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని యావత్ మహిళల లోకం తరుపున నారా లోకేష్ కి జేజేలు పలుకుతున్నాం అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మహానాడు వేదిక సందర్భంగా తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కాకపోయినా మహిళా సాధికారికతకు పెద్దపీట వేస్తున్న తెలుగుదేశం పార్టీ భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడే విధంగా 2029 ఎన్నికలలో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తానని ఆ విధంగా సీట్లను మహిళలకు కేటాయిస్తానని నారా లోకేష్ ప్రకటించడం మహిళా లోకంలో ఆనందం వెల్లు విరుస్తుంది అని డాక్టడాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. ఆనాడు స్వర్గీయ నందమూరి ఎన్టీ రామారావు మహిళల సాధికారికత కోసం ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. నేడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారు. అదే బాటలో తాత కు తగ్గ మనవడుగా మన లోకేష్ అన్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తానని ప్రకటించడం భారతదేశ చరిత్రలో ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. ఈ నిర్ణయం ప్రతి మహిళ ఇంట్లో ప్రతి మహిళ గుండెల్లో ధైర్యం లోకేష్ అన్న ఎప్పటికీ మహిళా లోకం మర్చిపోదని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ వివరించారు. మహిళా లోకం తరఫున ఆయనకు శిరస్సు వంచి నమస్కారాలు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని అన్నారు. ప్రతి మహిళకు ధైర్యాన్ని ఇచ్చారు, భరోసాని కల్పించారు, రాజకీయాలలో ప్రస్థానానికి నాంది పలికారు ఇది లోకేష్ అన్న మాకు ఇచ్చిన ధైర్యం ఎప్పటికీ మర్చిపోలేము అని డాక్టర్ లక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా లోని వివిద హోదాల్లో ఉన్న తెలుగు మహిళా మణులు మరియు జిల్లా మహిళా కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.




# పి-4 పథకం అంటే పేదలను ఆదుకోవడం: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



**దర్శి,మే 29.అక్షర టైమ్స్:-(ఎస్.** సత్యనారాయణ) : మన ప్రియతమ ముఖ్యమంత్రి, జాతీయ పార్టీ అధ్యక్షులైన చంద్రబాబు ఇచ్చిన పిలుపును ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలి, రాష్ట్రంలో గొడ్డలి వేటు మళ్లీ పడకూడదని అప్రమత్తతతో వ్యవహరించాలి. గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలకు తెలియజేయాలి. మహానాడు గ్రాండ్ సక్సెస్ ఆంధ్ర రాష్ట్ర దిశదశ్య మార్చే ఒక వేదికగా మనం చెప్పుకోవాలి. చంద్రబాబు పి -4 పథకం అంటే పేదలను ఆదుకోవడం గొడ్డలి పార్టీకి కూడా పి ఫోర్ ఉంది అదే పవర్ ప్రాపర్టీ పైసా పార్టనర్ షిప్. ఇలా అడ్డగోలుగా ఆస్తులు సంపాదించి తమ ఖజానాను నింపుకోవడమే గొడ్డలి పార్టీ పి ఫోర్, గొడ్డలి పార్టీ అధినేత పిఏ గా పనిచేసిన కే నాగేశ్వర్ రెడ్డి కెఎన్ఆర్ అవినీతి సామ్రాజ్యం సీట్ అధికారుల దర్యాప్తులో బట్టబయలైంది అని దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన ఒక చిరు ఉద్యోగి అకౌంట్లో వేలకోట్ల రూపాయలు ఉన్నాయి. నాగేశ్వర్ రెడ్డి భార్య అకౌంట్లో 20 కోట్లు ఎలా వచ్చాయో గొడ్డలి పార్టీ నేతలు సమాధానం చెప్పాలి అని లక్ష్మి అన్నారు. ఇక నాగేశ్వర్ రెడ్డి అకౌంటు బ్యాంకు ఖాతాలు ఆస్తులు వివరాలు బినామీ ఖాతాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో కొనుగోలు చేసిన ఆస్తులు చూస్తే ఎవరైనా అవాక్కవ్వాల్సిందే ఇదంతా కూడా మద్యం అవినీతి సొమ్మేనని సీట్ దర్యాప్తులో బయటపడింది. అయితే ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గొడ్డలి పార్టీ అవినీతి అక్రమ ఆస్తులు కేఎన్ఆర్ కొనుగోళ్ల ఆస్తులు దర్శిలో కూడా మూలాలు బయటపడడం గత ఐదేళ్లు దర్శి లో గొడ్డలి పార్టీ అవినీతి అక్రమాలు దోపిడి దౌర్జన్యాలు ఈ సందర్భంగా అర్థమవుతున్నాయి అని ఆమె అన్నారు. సిట్ అధికారుల దర్యాప్తులో కేఎన్ఆర్ ఆస్తుల్లో 10 ఎకరాలు దర్శిలో కూడా కొనుగోలు చేశాడంటే ఇక్కడి గొడ్డలి పార్టీ వారి సహకారం లేకుండా జరుగుతుందా అని ప్రశ్నిస్తున్నాను అని ఆమె అన్నారు. ఇప్పటికైనా ప్రజల ఆలోచించాలి, అవినీతి పార్టీకి గొడ్డలి పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలి ప్రజల కోసం ప్రజల అభ్యున్నతి కోసం సంక్షేమం సామాజిక న్యాయం మహిళా సాధికారికత ధ్యేయంగా ముందుకు వెళుతున్న మన కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలి, అభిమానించాలని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహానాడు ను స్ఫూర్తిగా తీసుకొని ఐక్యంగా కలిసికట్టుగా దర్శిలో తెలుగుదేశం జెండా ఎగరాలని డాక్టర్ లక్ష్మి పిలుపునిచ్చారు.

# చర్చలకు గుడ్ బై చెప్పిన ఇరాన్

## అమెరికాతో తాడోపేడో తేల్చుకుంటామని కీలక ప్రకటన కారణం ఏంటంటే..




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరుకున్నాయి. అమెరికా- ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతాయని ఒకవైపు ఆశలు చిగురిస్తున్న తరుణంలోనే, హార్ముజ్ జలసంధిలో జరిగిన ఒక అనూహ్య ఘటన పరిస్థితిని ఒక్కసారిగా మార్చివేసింది. ఇరాన్ జెండాతో ప్రయాణిస్తున్న ఒక సరుకు రవాణా నౌకను అమెరికా దళాలు స్వాధీనం చేసుకోవడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించింది.ఈ ఘటన జరిగిన కొద్ది గంటల ముందే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతినిధి బృందాన్ని చర్చల నిమిత్తం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు పంపుతున్నట్లు ప్రకటించారు. అయితే, నౌక స్వాధీనం తర్వాత ఇరాన్ తన వైఖరిని కఠినతరం చేసింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో కొత్త విడత చర్చలు జరిపే ప్రణాళికలేవీ తమ ప్రభుత్వానికి లేవని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది.ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలు జరుగుతున్నాయనే వార్తలను ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ ఐఆర్ఎన్ఎ పూర్తిగా కొట్టిపారేసింది. అటువంటి చర్చలు ఏవీ షెడ్యూల్ చేయబడలేదని, ఇది కేవలం ఒక బూటకమని స్పష్టం చేసింది. అమెరికా విధిస్తున్న దిగ్బంధనం మరియు దాడులు కొనసాగుతున్నంత కాలం చర్చల ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చిచెప్పింది. ఈ ఉద్రిక్తతల వల్ల ఇప్పటివరకు జరిగిన ప్రాణనష్టంపై ఇరాన్ భీతి గొలిపే గణాంకాలను విడుదల చేసింది.యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి కనీసం 3,375 మంది మరణించారని, అందులో 383 మంది చిన్నారులు కూడా ఉన్నారని ఇరాన్ లీగల్ మెడిసిన్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. కేవలం ఇరాన్‌లోనే కాకుండా లెబనాన్‌లో 2,290 మందికి పైగా, ఇజ్రాయెల్‌లో 23 మంది, ఇతర గల్ఫ్ దేశాలలో డజనుకు పైగా మరణించారు. ఈ ఘర్షణల్లో 15 మంది ఇజ్రాయెల్ సైనికులు మరియు 13 మంది అమెరికన్ సైనికులు కూడా ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.వ్యూహాత్మకమైన హార్ముజ్ జలసంధి ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పుగా మారింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలమార్గంపై ఇరాన్ రాకపోకలను పరిమితం చేసింది. దీనికి ప్రతిచర్యగా అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని విధించింది. ఈ జలమార్గం కేవలం చమురుకే కాకుండా సహజ వాయువు, ఎరువులు, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలకు అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరాకు అత్యంత కీలకమైనది. ఈ దిగ్బంధనం వల్ల ప్రపంచ దేశాల సరఫరా గొలుసు దెబ్బతినడమే కాకుండా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.మరోవైపు, లెబ నాన్‌లో ఇజ్రాయెల్‌తో పది రోజుల పాటు కొనసాగు తున్న తాత్కాలిక కాల్పుల విరమణ నేపథ్యంలో కొంత ఊరట కనిపిస్తోంది. యుద్ధంలో సర్వం కోల్పో యిన వేలాది మంది ప్రజలు తమ స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. కానీ, ఇస్లామాబాద్‌లో జరగాల్సిన చర్చల విషయంలో నెలకొన్న అనిశ్చితి వల్ల ఈ శాంతి ఎంతకాలం ఉంటుందోనన్న ఆందోళన నెలకొంది. పాకిస్థాన్ ప్రభుత్వం ఈ చర్చల కోసం దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని కోటలా మార్చినప్పటికీ, ఇరాన్ నిరాకరణతో ఆ ప్రయత్నాలు అగమ్యగోచరంగా మారాయి.అమెరికా తన "గరిష్ట ఒత్తిడి" వ్యూహాన్ని కొనసాగిస్తుంటే, ఇరాన్ తన సార్వభౌమాధికారం మరియు ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటామని హెచ్చరిస్తోంది. ఈ రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన పశ్చిమాసియాను ఒక భారీ యుద్ధం వైపు నెట్టే ప్రమాదం కనిపిస్తోంది. ప్రస్తుతానికి దౌత్య మార్గాలు మూసుకుపోవడంతో, అంతర్జాతీయ సమాజం ఈ సంక్షోభం ఎటు దారితీస్తుందోనని ఆందోళనతో గమనిస్తోంది.

# ది హోస్టెల్లర్ సంచలనం: 150 కోట్ల భారీ పెట్టుబడితో కొత్త రికార్డు




ప్రముఖ బ్యాక్‌ప్యాకర్ హాస్టల్ చైన్ 'ది హోస్టెల్లర్' తాజాగా సీరీస్ బి ఫండింగ్‌లో ఏకంగా 150 కోట్లు సమీకరించింది. భారతదేశంలోని ఏ బ్యాక్‌ప్యాకర్ చైన్‌కైనా దక్కిన అతిపెద్ద ఇన్‌స్టిట్యూషనల్ ఫండింగ్ ఇదే కావడం విశేషం. 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత, బడ్జెట్ ట్రావెల్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ఈ స్టార్టప్ సిద్ధమైంది. దేశవ్యాప్తంగా వేసవి సెలవుల రద్దీ మొదలవుతున్న తరుణంలో ఈ నిధులు అందడం సంస్థకు పెద్ద ప్లస్ పాయింట్.సిక్స్‌సెన్స్ వెంచర్స్‌తో పాటు ఇతర ప్రముఖ ఇన్వెస్టర్లు ఈ ఫండింగ్ రౌండ్‌లో పాల్గొన్నారు. భారతదేశంలో చిన్న తరహా హాస్పిటాలిటీ వెంచర్ల పట్ల ఇన్వెస్టర్ల దృక్పథం మారుతోందని ఈ పెట్టుబడి నిరూపిస్తోంది. కేవలం ఒక్క హాస్టల్‌తో మొదలైన ఈ ప్రయాణం, నేడు దేశవ్యాప్త బ్రాండ్‌గా ఎదిగింది. సొంతంగా ఎదిగిన స్టార్టప్‌లు కూడా మార్కెట్‌లో గణనీయమైన స్థాయికి చేరుకోగలవని ఈ విజయం చాటిచెబుతోంది.యువ పర్యాటకుల కోసం భారీగా విస్తరిస్తున్న 'ది హోస్టెల్లర్'ప్రస్తుతం ఈ బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా 60కి పైగా ప్రాపర్టీలు ఉండగా, అందులో 3,500 బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే వీటిని 150 ప్రాపర్టీలకు పెంచాలని సంస్థ ప్లాన్ చేస్తోంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా బెడ్ల సామర్థ్యాన్ని 10,000కు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా జెన్-జీ పర్యాటకులను ఆకర్షించే పాపులర్ డెస్టినేషన్లపై ఈ సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.విస్తరణ విభాగంప్రస్తుత పరిస్థితి2026 లక్ష్యాలు మొత్తం బెడ్ల సామర్థ్యం3,500బెడ్స్10,000 బెడ్స్ప్రాపర్టీల సంఖ్య60 హాస్టళ్లు150 హాస్టళ్లువిస్తరణతో పాటు లాభదాయకతను కొనసాగించడంపై కంపెనీ ఫోకస్ పెట్టింది. ఈ నిధులను భారీగా కొత్త నియామకాలకు, బుకింగ్ టెక్నాలజీని మెరుగుపరచడానికి ఉపయోగించనున్నారు. సమ్మర్ రష్ దగ్గరపడుతుండటంతో, పర్యాటకులు నమ్మకమైన, తక్కువ ధరలో దొరికే బస కోసం చూస్తున్నారు. బడ్జెట్ ఫ్రెండ్లీ పర్యాటకులకు బెస్ట్ ఛాయిస్‌గా నిలవాలని 'ది హోస్టెల్లర్' పావులు కదుపుతోంది.**బడ్జెట్ ట్రావెల్ మార్కెట్‌లో దూసుకుపోతున్న స్టార్టప్**భారతదేశంలో యువత ట్రావెల్ కల్చర్ మారుతోంది. కేవలం ప్రయాణమే కాకుండా, కొత్త అనుభవాలను పంచుకోవడానికి వారు ఇష్టపడుతున్నారు. ఈ పెట్టుబడి ఆర్గనైజ్డ్ హాస్టల్ రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచుతోంది. మార్కెట్ లీడర్‌గా ఎదిగిన 'ది హోస్టెల్లర్' ప్రయాణం ఎంతోమంది స్థానిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిస్తోంది. హాలిడే సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాది మంది అతిథులకు స్వాగతం పలికేందుకు ఈ సంస్థ సర్వం సిద్ధం చేసుకుంది.

# లక్ కాదు బ్రదర్.. కష్టం!

## 20 సార్లు ఫెయిల్ అయి గూగుల్‌లో జాబ్ కొట్టిన యువకుడు!




సాఫ్ట్‌వేర్ రంగంలో గూగుల్ లాంటి కంపెనీలో ఉద్యోగం సంపాదించడం అంటే అది ఒక అదృష్టమని చాలామంది భావిస్తారు. కానీ, ఆ అదృష్టం వెనుక ఎన్ని కన్నీళ్లు, ఎన్ని నిద్రలేని రాత్రులు, ఎన్ని అవమానాలు ఉంటాయో ఎవరూ గమనించరు. సరిగ్గా ఇదే విషయాన్ని నిరూపిస్తూ బెంగళూరు కు చెందిన ఒక టెక్ ప్రొఫెషనల్ తన సక్సెస్ జర్నీని సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్ అవుతోంది. కేవలం ఒకటీ రెండు కాదు, ఏకంగా 20కి పైగా ప్రముఖ కంపెనీల నుంచి రిజెక్షన్ లెటర్లు అందుకున్నా కృంగిపోకుండా గూగుల్‌లో జాబ్ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు నమన్ కుమార్ గౌతమ్.నమన్ తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను బయటపెట్టాడు. మైక్రోసాఫ్ట్ వీసా అడోబ్ , మీషో బుకింగ్.కామ్ వంటి దిగ్గజ సంస్థల నుంచి అతనికి నిరాశే ఎదురైంది. కొన్ని కంపెనీలు అతను "పొజిషన్ రిక్వైర్మెంట్స్‌కు సరిపోవడం లేదని" చెబితే, మరికొన్ని "యూరోపియన్ యూనియన్ నివాసితులకు మాత్రమే ఈ ఉద్యోగం" అని మొహం మీదే చెప్పేశాయి. ఇంకొన్ని కంపెనీలైతే ఆ వేకెన్సీలు అప్పటికే భర్తీ అయిపోయాయని సమాధానం ఇచ్చాయి. ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా 20 కంపెనీలు తిరస్కరించడంతో ఒక దశలో అతను తీవ్ర నిరాశకు గురయ్యాడు.**లక్ వెనుక దాగున్న 'హజిల్'**నమన్ తన వీడియోలో తాను ఏడుస్తున్న ఒక చిన్న క్లిప్‌ను కూడా జోడించాడు. "గూగుల్‌లో పనిచేస్తున్నావా.. నువ్వు చాలా లక్కీ బ్రో!" అని అనేవారికి సమాధానంగా, "మీరు చూడని కష్టాన్నే అదృష్టం అని పిలుస్తారు" అని అతను చాలా గట్టిగా చెప్పాడు. టైర్-3 కాలేజీలో చదివిన తనకు గూగుల్ లాంటి చోట ఉద్యోగం రావడం వెనుక అంతులేని శ్రమ ఉందని తెలిపాడు. చివరకు ఆగస్టు 2025లో గూగుల్ నుంచి అంగీకార పత్రం అందడంతో అతని సుదీర్ఘ పోరాటం ఫలించింది. రిజెక్షన్ అనేది ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని, అది గమ్యం కాదని అతను యువతకు సందేశమిచ్చాడు.**బెంగళూరు ఐటీ వర్గాల్లో హాట్ టాపిక్**ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు నమన్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. "నీ రిజల్ట్ మాత్రమే అందరికీ కనిపిస్తుంది, కానీ ఆ నిద్రలేని రాత్రులు, ఒత్తిడి మాకు తెలుసు.. నీవు దీనికి అర్హుడివి" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు లాంటి ఐటీ హబ్‌లో పోటీ విపరీతంగా ఉన్నప్పుడు, ఇలాంటి ఇన్స్పిరేషన్ స్టోరీలు నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి. కేవలం డిగ్రీ లేదా కాలేజీ పేరు చూసి అవకాశాలు రాకపోయినా, పట్టుదలతో నైపుణ్యాన్ని పెంచుకుంటే ప్రపంచంలోనే టాప్ కంపెనీల్లో స్థానం సంపాదించవచ్చని నమన్ నిరూపించాడు.నమన్ కథ మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. కెరీర్ ఎదుగుదలలో ఫెయిల్యూర్స్ అనేవి సహజం. ప్రతి రిజెక్షన్ లెటర్ మనలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి ఒక అవకాశం ఇస్తుంది. గూగుల్ వంటి సంస్థలు కేవలం అభ్యర్థి ప్రతిభను మాత్రమే కాదు, వారి పోరాట పటిమను కూడా గుర్తిస్తాయి. బెంగళూరులో ఐటీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వేల మంది యువతకు నమన్ ఇప్పుడు ఒక రోల్ మోడల్‌గా నిలిచాడు. రిజెక్షన్లను చూసి వెనకడుగు వేయకుండా, ఆ అనుభవాలనే మెట్లుగా మార్చుకుని శిఖరాన్ని చేరుకోవచ్చని ఈ యువ టెక్కీ ఉదంతం మనకు చెబుతోంది.ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం అకడమిక్ నాలెడ్జ్ మాత్రమే సరిపోదు. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా నిరంతరం అప్‌డేట్ అవుతూ ఉండాలి. నమన్ తన ఇంటర్వ్యూల సమయంలో తలెత్తిన లోపాలను గుర్తించి, వాటిపై కసరత్తు చేయడం వల్లే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగాడు. ఒక్కోసారి మనకు అత్యంత కావాలనుకున్నది దక్కకపోయినా, అంతకంటే మెరుగైనది మనకోసం ఎదురుచూస్తూ ఉండవచ్చు. కాబట్టి, ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపకూడదని, నిలకడగా ఉండటమే విజయానికి అసలైన రహస్యమని ఈ కథనం స్పష్టం చేస్తోంది.

# రాగి ధరలు భారీగా పెరగబోతున్నాయి



కొనుగోలుపై కీలక సూచన చేస్తున్న ప్రముఖ ఆర్థిక సంస్థలు ప్రస్తుత 2026 ఏప్రిల్ నెలలో అంతర్జాతీయ లోహాల మార్కెట్‌లో రాగి ధరలు అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్ 20, సోమవారం నాటి ట్రేడింగ్‌ను గమనిస్తే, రాగి ధరలు కొంత మేర తగ్గుముఖం పట్టడం ఇన్వెస్టర్లను ఆలోచనలో పడేసింది. గత ఏడాది కాలంగా రాగి ధరలు విపరీతంగా పెరుగుతాయని మార్కెట్ పండితులు అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా పశ్చిమాసియాలో అమెరికా - ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన ఈ అంచనాలను తలకిందులు చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ అయిన కామెక్స్‌లో రాగి ధర పౌండ్‌కు 6.0535 డాలర్ల వద్దకు చేరగా.. మన దేశీయ ఎంసిఎక్స్ మార్కెట్‌లో కిలోగ్రాముకు 1268.75 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. రాగి ధరల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. 2026 జనవరి నెలలో ఇవి సరికొత్త శిఖరాలను తాకాయి. జనవరి 29న లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో టన్ను రాగి ధర దాదాపు 14,527 డాలర్లకు చేరుకోవడం ఒక రికార్డు. ఆ సమయంలో చిలీ, ఇండోనేషియా వంటి ప్రధాన ఉత్పత్తి దేశాల్లోని గనుల్లో కార్మిక సమస్యలు లేదా సాంకేతిక అంతరాయాల వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ఒక్కసారిగా పెరగడంతో రాగికి డిమాండ్ ఊహించని రీతిలో పెరిగింది. అయితే ఫిబ్రవరి నెలాఖరు నుండి పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో, ఇన్వెస్టర్లు రాగి వంటి పారిశ్రామిక లోహాల కంటే బంగారం, వెండి వంటి సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపారు, ఇది రాగి ధరలపై ఒత్తిడిని పెంచింది. రాగి భవిష్యత్తుపై ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. గోల్డ్‌మన్ సాక్స్ వంటి సంస్థలు తమ ధరల అంచనాలను తగ్గించాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించడం వల్ల రాగి వినియోగం తగ్గుతుందని, అలాగే ఈ ఏడాది సరఫరా కూడా ఆశాజనకంగానే ఉంటుందని వారు భావిస్తున్నారు. దీనికి విరుద్ధంగా, జేపీ మోర్గాన్, సిటీ గ్రూప్ వంటి సంస్థలు మాత్రం రాగి కొరత రాబోయే రోజుల్లో తీవ్రమవుతుందని హెచ్చరిస్తున్నాయి.రాగి ధరలు భారీగా పెరగబోతున్నాయి.. ప్రపంచానికి షాకిచ్చిన కాపర్ దిగ్గజం కోచిల్కో.. పర్యావరణ హితమైన ఇంధన వనరుల వైపు ప్రపంచం మళ్లుతున్న తరుణంలో, సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్లు, పవర్ గ్రిడ్ల ఆధునీకరణకు జశీజూజూవతీ అత్యవసరమని, ఈ డిమాండ్‌ను తట్టుకునే స్థాయిలో ఉత్పత్తి పెరగడం లేదని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు రాగి ధరలను పరోక్షంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్ రాగి ఉత్పత్తిలో పెద్ద దేశం కాకపోయినప్పటికీ, హార్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో అశాంతి నెలకొంటే అది అంతర్జాతీయ వాణిజ్య రవాణా ఖర్చులను పెంచుతుంది. ఇది చివరికి రాగి ధరలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ధరలు కొంత తగ్గినట్లు కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా చూస్తే రాగికి ఉన్న పారిశ్రామిక ప్రాధాన్యత దృష్ట్యా ధరలు మళ్లీ పుంజుకునే అవకాశం పుష్కలంగా ఉంది. పారిశ్రామిక రంగంలో రాగిని "డాక్టర్ కాపర్" అని పిలుస్తారు, ఎందుకంటే దీని ధరల గమనాన్ని బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. ప్రస్తుత తగ్గుదల తాత్కాలికమేనని, భౌగోళిక ఉద్రిక్తతలు సర్దుమణిగితే రాగి మళ్లీ రికార్డు స్థాయికి చేరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# జూన్‌లో టాలీవుడ్ జాతర..

## ‘పెద్ది’ నుంచి ‘స్వయంభూ’ వరకు భారీ రిలీజ్‌లు రెడీ!

2026 జూన్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్న జోనర్లలో తెరకెక్కిన సినిమాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు, హారర్ కామెడీలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు, స్పోర్ట్స్ డ్రామాలు ఇలా అన్ని రకాల సినిమాలు ఈ నెలలో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. జూన్ మొదటి వారంలోనే టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ ఊపు రానుంది. జూన్ 3న ‘అసురాసుర’ సినిమా విడుదల కానుంది. యాక్షన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇక జూన్ 4న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ట్రైలర్, టీజర్లు సోషల్ మీడియాలో భారీ హైప్ క్రియేట్ చేశాయి. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అదే వారంలో జూన్ 5న ‘రావ్ బహదూర్’ విడుదల కానుంది. అలాగే హాలీవుడ్ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్’ కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మొదటి వారంలోనే బాక్సాఫీస్ వద్ద మంచి పోటీ కనిపించనుంది. జూన్ రెండో వారం మాత్రం కాస్త నెమ్మదిగా ఉండనుంది. జూన్ 11న ‘సంగీతం’ అనే సినిమా మాత్రమే విడుదల కానుంది. సంగీతం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రంపై సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అసలు పోటీ మాత్రం జూన్ మూడో వారంలో కనిపించనుంది. జూన్ 19న ఒకేసారి నాలుగు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. ‘బాలన్ ది బాయ్’, ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’, హారర్ కామెడీ మూవీ ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’, అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ‘మా ఇంటి బంగారం’ సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. ఈ నాలుగు చిత్రాలు పూర్తిగా భిన్నమైన జోనర్లలో ఉండటంతో ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా హారర్ కామెడీ సినిమాలకు ఇటీవల మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. జూన్ చివరి వారం మాత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హంగామా ఉండనుంది. జూన్ 26న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’ విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి బజ్ నెలకొంది. అదే రోజున స్పోర్ట్స్ డ్రామా ‘సూపర్ గోల్’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఇంటెన్స్ డ్రామా ‘లెనిన్’ కూడా జూన్ 26నే విడుదల కానుండటం విశేషం. దీంతో నెలాఖరులో మూడు ప్రధాన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగనున్నాయి. మొత్తం మీద చూస్తే 2026 జూన్ నెల టాలీవుడ్ ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతోందనే చెప్పాలి. భారీ పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న కాన్సెప్ట్ మూవీస్ వరకు అన్ని రకాల చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు



సిద్ధమవుతున్నాయి. ఇక వీటిలో ఏ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## వాట్ ఏ ప్లాన్ గురూ.. మహేశ్ బాబు వారణాసి వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్ ఆన్ ది వే.. !


మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. షూటింగ్ దశలో ఉన్న వారణాసి కొత్త షెడ్యూల్ వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. జక్కన్న టీం నెక్ట్స్ సినిమాలో వచ్చే ఓ భారీ వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేస్తుందట. ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్, భారీ సెట్స్, ఇంటెన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ లాంటి కీ ఎలిమెంట్స్ తో ఈ షెడ్యూల్ కొనసాగనుందట. తాజా టాక్ ప్రకారం నాన్ స్టాప్ నెల పాటు రాజమౌళి టీం ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సినిమాలో ఇదే బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అని.. భారతీయ సినిమా చరిత్రలో ఇప్పటిదాకా ఎవరూ ప్రయత్నించని విధంగా ఈ సీక్వెన్స్ ఉండబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌తోపాటు మహేశ్ బాబు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఇదే నిజమైతే జక్కన్న మరోసారి తన రికార్డులను తానే బీట్ చేయడం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.




## సూర్య ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ లాంగ్ వీకెండ్‌ను టార్గెట్ చేస్తూ ఈ డేట్‌ను లాక్ చేసినట్లు తెలుస్తుంది. ‘సార్’, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస హిట్లతో జోరుమీదున్న వెంకీ అట్లూరి, ఈసారి సూర్యతో కలిసి ఒక విలక్షణమైన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను ప్రేక్షకు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ ‘సంజయ్ విశ్వనాథ్’ పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతుండగా.. సూర్య సరసన యంగ్ బ్యూటీ మమితా బైజు కథానాయికగా నటిస్తుంది. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, మరియు భవాని శ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి సినిమాటోగ్రఫీని, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## భారతీయ ఇండీ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా రానా



తెలుగు హీరో రానా దగ్గుబాటికి చెందిన ‘స్పిరిట్ మీడియా’ మన దేశంలో ఇండీ సినిమాలకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా మారుతూ కొత్త ట్రెండ్ సెట్ చేస్తుంది. ఇండియాలోని అన్ని భాషలకు చెందిన చిన్న చిత్రాలను, క్రియేటివ్ కథలను సపోర్ట్ చేస్తూ వాటిని థియేటర్ల వరకు తీసుకురావడానికి స్పిరిట్ మీడియా గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఫిల్మ్ ఫెస్టివల్స్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న సినిమాలను, మన నేటివిటీకి దగ్గరగా ఉండే నిజాయితీ గల కథలను ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడమే స్పిరిట్ మీడియా మెయిన్ టార్గెట్. దీనివల్ల పెద్దగా గుర్తింపు లేని ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, రచయితలకు తమ కథలను దేశవ్యాప్తంగా చూపించే ఒక అద్భుతమైన ఛాన్స్ దొరుకుతోంది. ఈ ఇండీ ఫిలిం మూవ్‌మెంట్‌లో ప్రస్తుతం నార్త్ ఈస్ట్ సినిమాలు చాలా స్పెషల్‌గా నిలుస్తూ వేగంగా ఎదుగుతున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్ లాంటి ప్రాంతాల నుండి వస్తున్న సినిమాలు ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతి ఇస్తున్నాయి. అక్కడి విభిన్నమైన కల్చర్‌ని, అచ్చమైన భావోద్వేగాలని చాలా రియలిస్టిక్‌గా చూపిస్తూ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ గా ఈ శుక్రవారం థియేటర్లలోకి వస్తున్న సిక్కిం మూవీ ‘షేప్ ఆఫ్ మోమో’ని చెప్పుకోవచ్చు. ట్రిబేనీ రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పటికే 15కి పైగా అంతర్జాతీయ అవార్డ్స్ గెలుచుకుంది. జోయా అక్తర్, పాయల్ కపాడియా లాంటి క్రేజీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా సపోర్ట్ ఇవ్వడం విశేషం. ఇలాంటి అద్భుతమైన సినిమాలను థియేటర్లకు తీసుకురావడం ద్వారా స్పిరిట్ మీడియా అన్ని ప్రాంతాల సినిమాలకు సమానమైన ఇంపార్టెన్స్ ఇస్తూ ఒక మంచి సినిమా కల్చర్ ని బిల్డ్ చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com